

రిజిస్ట్రేషన్ల ఎత్తుగడ

నున్నలో లెస్ మార్కెట్ విలువల వ్యవహారం

- వైసీపీ హయాంలో వెంచర్లకు అడ్డగోలు అనుమతులు
- రిజిస్ట్రేషన్ ఖర్చులో సగానికి సగం తగ్గింపు
- మిగతా వారంతా మొత్తం చెల్లించాల్సిందే..
- నున్న లే అవుట్‌లో గజం 4 వేలకే రిజిస్ట్రేషన్
- బయటివారికేమో రూ.9,500

ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ రూరల్ మండలం నున్నలో ప్రైవేట్ వెంచర్ల నిర్వాహకులు వేస్తున్న ఎత్తుగడల కారణంగా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం భారీగా తగ్గుతోంది. కిందటి వైసీపీ హయాంలో రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులను పట్టుకుని పలు వెంచర్ల సంస్థలు మార్కెట్ విలువలో మినహాయింపు పొందాయి. కొన్ని వెంచర్లకు మినహాయింపులు రావటంతో తక్కువ ధరకు రిజిస్ట్రేషన్లు చేసేస్తున్నారు. కానీ, పేదలకు అలాంటి మినహాయింపులేమీ ఇవ్వలేదు. ప్రభుత్వం మారినా వైసీపీ హయాంలో అడ్డదారిలో తెచ్చుకున్న అనుమతులను చూపుతూ ఇప్పటికీ భారీగా రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నారు. రిజిస్ట్రేషన్ చార్జీలు తక్కువగా ఉంటాయన్న ఉద్దేశంతో తమ వ్యాపారాన్ని పెంచుకునేందుకు పలు వెంచర్ల యాజమానులు ప్రయత్నిస్తున్నారు.

పెద్దలకో రేటు.. పేదలకో రేటు..

నున్న శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతం. విజయవాడ గ్రేటర్ విలీన ప్రతిపాదిత జాబితాలో ఉంది. ఇక్కడ గజం రూ.9,500గా రిజిస్ట్రేషన్ ధర ఉంది. కొన్ని వెంచర్ల సంస్థల నిర్వాకం కారణంగా ఇందులో సగం అంటే రూ.4 వేలే ప్రభుత్వ ఖజానాకు వెళ్తోంది. మిగతా సొమ్ము మినహాయింపు పొందటం వల్ల వెంచర్ల నిర్వాహకులకు లాభం చేకూరుతోంది. అలా అని ఈ మినహాయింపు అందరికీ రాలేదు. ఎంపిక చేసిన కొందరికే ఇచ్చారు. ఉదాహరణకు నున్నలో సర్వే నెంబర్ 41/2లో గజం రూ.9,500కే రిజిస్ట్రేషన్ చేశారు. కుందావారి కండ్రికలో సర్వే నెంబర్ 19/1లో గజం రూ.7 వేలకే రిజిస్ట్రేషన్ చేశారు. ఈ రెండు ప్రాంతాలను కలుపుతూ మధ్యలో ఓ వెంచర్ వేశారు. ఈ వెంచర్ యాజమాన్యం కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో మినహాయింపులు తెచ్చుకోవడంతో వారి లే అవుట్‌లో గజం రూ.4 వేలకే రిజిస్ట్రేషన్ చేశారు. లే అవుట్ మినహా మిగిలిన చోట్ల మాత్రం రూ.9,500, రూ.7 వేల చొప్పున వసూలు చేస్తున్నారు.

ప్రభుత్వం దృష్టిపెట్టాలి

మిగిలిన ర్యాపిడ్ గ్రోత్ ఏరియాల్లోనూ ఇవే సంస్థలు వెంచర్లు వేశాయి. అక్కడ కూడా మినహాయింపులు పొందాయా లేదా అనేది తేలాల్సి ఉంది. ఈ అంశంపై ప్రభుత్వం తక్షణం దృష్టిసారించి, అడ్డగోలుగా ఇచ్చిన అనుమతులను రద్దుచేసి అందరికీ ఒకే విధానాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉంది.

- నందివాడ మండలంలో వైసీపీ సానుభూతిపరులైన కోటీశ్వరులు సైతం వృద్ధాప్య పెన్షన్లు తీసుకుంటున్నారు. తమకున్న కోట్ల రూపాయల ఆస్తిని పిల్లలు, మనవళ్ల పేరున మార్చి మరీ పెన్షన్లు తీసుకుంటున్నారు. ఇందుకోసం ఏకంగా లక్షల విలువ చేసే కార్లలో వస్తుండటం ఆశ్చర్యచకితమే.
- నందివాడ మండలంలోనే సొంత కారు, ఇల్లు, చేపల చెరువులు, వ్యవసాయ భూములుండి కోటీశ్వరుడైన వైసీపీ ముఖ్య నాయకుడు దర్జాగా ఐదేళ్లుగా వృద్ధాప్య పెన్షన్ తీసుకుంటున్నాడంటే నమ్మితీరాల్సిందే.
- చల్లపల్లి మండలంలో వినికిడి సమస్య ఉన్నట్టు చూపించి చాలామంది సదరం సర్టిఫికెట్లు పొందారు. వీరంతా భారీగా పెన్షన్లు దండుకుంటున్నారు. కానీ, క్షేత్రస్థాయిలో 30 మందికి పైగా వినికిడి సమస్య లేదని, వారికి స్పష్టంగా వినిపిస్తోందని తెలుసుకున్న సచివాలయ సిబ్బంది ఆశ్చర్యపోతున్నారు.

ఒకటా రెండా.. ఇలాంటి వారు వేలల్లో పెన్షన్లు తీసుకుంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్య నాయకుల ప్రోద్బలంతో, వలంటీర్ల సహకారంతో, డాక్టర్ల ప్రోద్బలంతో దొంగ సదరం సర్టిఫికెట్లు సృష్టించి, నాలుగేళ్లుగా ప్రభుత్వ పెన్షన్‌ను పొందుతున్నారు. క్షేత్రస్థాయిలో సచివాలయ సిబ్బంది తనిఖీల్లో ఇలాంటి బాగోతాలు చాలానే బయటపడగా, టీడీపీ నాయకుల పరిశీలనలో మరిన్ని వెలుగుచూశాయి.

సదరం.. బెదరం..

జిల్లాలో దొంగ సదరం సర్టిఫికెట్లతో పెన్షన్ దోపిడీ

- వైసీపీ ప్రభుత్వ హయాంలో భారీగా జారీ
- స్థానిక నాయకులు, కొందరు వలంటీర్ల ప్రోత్సాహంతోనే..
- వినికిడి సమస్య చూపించి భారీగా సర్టిఫికెట్లు
- ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.30 వేల వరకూ వసూలు
- ఆధార్‌లో పుట్టిన తేదీ, వయస్సు కూడా మార్పు
- ఆస్తులున్న వైసీపీ సానుభూతిపరులకు వృద్ధాప్య పెన్షన్
- సచివాలయ సిబ్బంది తనిఖీల్లో బయటపడిన నిజాలు

గుడివాడ : జిల్లాలో నకిలీ సదరం సర్టిఫికెట్ల బాగోతాలు బయటపడుతున్నాయి. అంగవైకల్యం విషయంలో దొంగ సదరం సర్టిఫికెట్లను పొంది దర్జాగా ప్రభుత్వ పెన్షన్‌ను పొందుతున్నారు. ప్రధానంగా వృద్ధాప్య, వితంతు పెన్షన్లలో దోపిడీ జరుగుతోంది. అర్హత లేకున్నా సదరం సర్టిఫికెట్లను పొందిన కొంతమంది అక్రమంగా పెన్షన్ తీసుకుంటున్నారు.

భారీగా అక్రమాలు

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అంగవైకల్యం లేకున్నా ఉన్నట్టు సర్టిఫికెట్లను సృష్టించి, అక్రమంగా పెన్షన్లు పొందినవారు చాలామందే ఉన్నారు. సాధారణంగా అంగవైకల్యం ఉన్నవారికే పెన్షన్ అధికంగా వస్తుంది. 40 శాతం పైబడి ఉంటే, పెన్షన్‌కు అర్హులవుతారు. జిల్లాలో వైసీపీ నాయకులు.. కొందరు వలంటీర్లతో కలిసి ఈ మోసానికి పాల్పడుతున్నారు. అర్హత లేకున్నా సదరం సర్టిఫికెట్లు ఇప్పిస్తామని, రూ.30 వేలు ఖర్చు చేస్తే జీవితకాలం పెన్షన్ పొందవచ్చునని నమ్మిస్తున్నారు. ముఖ్యంగా వైసీపీ నాయకుల కుటుంబీకులు, బంధువులకు సదరం సర్టిఫికెట్లను భారీగా ఇప్పించారు. వలంటీర్ల ద్వారా అర్జీలు పెట్టుకుని నాలుగేళ్లుగా ప్రభుత్వ సొమ్ము దోచుకుంటున్నారు. వైసీపీ నాయకుల ప్రోద్బలంతో ప్రభుత్వ వైద్యులు సైతం ఒత్తిడి తలొగ్గి అక్రమంగా సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారని సమాచారం. మచిలీపట్నం, విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రుల్లో దొంగ సదరం సర్టిఫికెట్లను జారీ చేస్తున్నట్టు ఇంటెలిజెన్స్ వర్గాల సమాచారం.

జంక్షన్ కేంద్రంగా ఆధార్‌లో మార్పులు

హనుమాన్ జంక్షన్ కేంద్రంగా ఆధార్‌లో మార్పులు ఎక్కువగా చోటుచేసుకున్నట్లు సమాచారం. జనన ధ్రువీకరణ పత్రంతో సంబంధం లేకుండా ఆధార్‌లో వయస్సును మార్చాలంటే రూ.3 వేల నుంచి రూ.5 వేలు తీసుకుంటున్నట్లు వినికిడి. కృష్ణా, ఏలూరు జిల్లాలకు చెందిన చాలామంది తమ ఆధార్‌లలో వయసులను మార్చుకున్నట్లు సమాచారం. నాలుగేళ్లలో వందలాది మంది తమ ఆధార్‌లలో వయసులను మార్చుకున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

మచ్చుకు కొన్ని..

- గుడివాడ మండలం మోటూరుకు చెందిన వ్యక్తి నాలుగేళ్లుగా దర్జాగా అంగవైకల్య పింఛన్ పొందుతున్నాడు. ఇతనికి అంగవైకల్యం కేవలం ఐదు శాతం కూడా ఉండదని, అయినా పెన్షన్ పొందుతున్నాడని స్థానికులే చెబుతున్నారు. చేతికి దెబ్బ తగలడంతో రాడ్డు వేశారు. సదరు వ్యక్తి భారీ బస్తాలను మోయడంతో పాటు పొలం పనులు పూర్తిగా చేసుకుంటున్నాడు.
- గుడివాడకు చెందిన వైసీపీ సానుభూతిపరురాలు నాలుగేళ్లుగా ఒంటరి మహిళ పింఛన్ పొందుతోంది. నాలుగేళ్ల కిందట చిన్నపాటి మనస్పర్థలతో భర్త నుంచి విడిపోయి ఆరు నెలలుగా వేరుగా ఉంటోంది. సదరు మహిళ సోదరుడు వార్డులో వైసీపీ కీలక నేతగా ఉన్నాడు. భర్త వదిలేసినట్టు చూపి వలంటీర్ సాయంతో నాలుగేళ్లుగా ఒంటరి మహిళ పెన్షన్ అందజేసేలా చేశాడు. కాగా, ప్రస్తుతం సదరు మహిళ భర్తతో కలిసి కాపురం చేస్తుండటం విశేషం.
- గుడివాడ మండలం శేరీవేల్పూరుకు చెందిన వైసీపీ సానుభూతిపరులు ఏకంగా ఆధార్‌లో వయసు మార్చుకుని వృద్ధాప్య పెన్షన్ పొందుతున్నారు. గుడివాడలో ఒక ప్రైవేట్ బ్యాంకులో వైసీపీ నాయకుల అండతో ఆధార్‌లో వయసులను మార్చినట్టు గ్రామస్థులు చెబుతున్నారు.
- నందివాడ మండలం తుమ్మలపల్లి, నందివాడ, జొన్నపాడు తదితర గ్రామాల్లో సదరం సర్టిఫికెట్ల విషయంలో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 50 ఏళ్లు దాటకుండానే వృద్ధాప్య పెన్షన్లు పొందుతున్నారని సచివాలయ సిబ్బందే మాట్లాడుకుంటున్నారు.

జిల్లా అభివృద్ధి కోసం కలిసికట్టుగా..

జిల్లా అభివృద్ధి కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలిసికట్టుగా పనిచేయాలని జడ్పీ సభ్యులు నిర్ణయించారు. మచిలీపట్నంలో శనివారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరగ్గా, ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు అవసరమైన సాగునీటిని సక్రమంగా విడుదల చేయాలని, నీటిపారుదల శాఖ అధికారులు ముందుచూపుతో వ్యవహరించాలని సమావేశంలో పాల్గొన్న మంత్రి కొల్లు రవీంద్ర, శాసనసభ్యులు.. అధికారులకు సూచించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 50 రోజులపైనే గడిచినా అధికారులు మాట వినడం లేదని ఎమ్మెల్యేలు ఆవేదన వెలిబుచ్చగా, ఆయా మండలాల్లో సమస్యలను జడ్పీ సభ్యులు ఏకరువు పెట్టారు.

కొందరు అధికారుల తీరు మారాల్సిందే..

- కొత్త ప్రభుత్వం ఏర్పడినా ఎమ్మెల్యేల మాట వినరెందుకు..?
- సాగు, తాగునీరు అందించేందుకు ప్రణాళికతో ముందుకెళ్లండి
- పాఠశాల భవన నిర్మాణాలపై నిర్లక్ష్యమేల..?
- తీరప్రాంత ప్రజలకు సాగు, తాగునీరు ఇస్తాం..
- జడ్పీ సర్వసభ్య సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర

హాజరైన జిల్లా ఎమ్మెల్యేలు





జడ్పీ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, అధికారులు (ఇన్‌సెట్‌లో) మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంకు నివాళులర్పిస్తున్న మంత్రి కొల్లు, జడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యేలు, కలెక్టర్

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : తొలుత భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతికి జడ్పీ సమావేశం నివాళులర్పించింది. స్థానిక జడ్పీ కన్వెన్షన్ హాల్లో చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అధ్యక్షతన శనివారం జరిగిన ఈ సమావేశంలో మంత్రి, జడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యేలు, కలెక్టర్, జడ్పీ ఇన్‌చార్జి సీఈవో పాల్గొన్నారు. ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు హాజరుకాలేదు.

ప్రజల నమ్మకానికి అనుగుణంగా..

గ్రామస్థాయిలో ఉపాధి హామీ సిబ్బందిని, డ్వాక్రా సంఘాలను పర్యవేక్షించే మహిళా సిబ్బందిని అకారణంగా తొలగిస్తున్నారంటూ ఒకానొక దశలో వైసీపీకి చెందిన జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు రచ్చ చేసేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా గనులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ఉద్యోగుల తొలగింపునకు అనేక కారణాలు ఉన్నాయని, ఈ అంశాన్ని ఎవరూ రాద్ధాంతం చేయొద్దన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని, వాటి నుంచి బయటపడాలనే ఉద్దేశంతో కూటమి అభ్యర్థులను గెలిపించారని, వారి నమ్మకానికి అనుగుణంగా పరిపాలనను కొనసాగించి జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి సహకారంతో మచిలీపట్నంలో రూ.70 వేల కోట్లతో రిఫైనరీని ఏర్పాటు చేస్తామని చెప్పారు. టిడ్కో ఇళ్లు, జగనన్న కాలనీల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు.

పాఠశాలలకు భవనాలు లేకున్నా పట్టించుకోరా..

విద్యాశాఖపై జరిగిన సమీక్షలో పలువురు ఎమ్మెల్యేలు, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు పాఠశాలల దుస్థితిపై గళమెత్తారు. పెదపారుపూడి మండలం కోర్నిపాడు గ్రామంలో పాఠశాల భవనం నిర్మించకుండా ఏడాదిగా జాప్యం చేస్తున్నారని, బంటుమిల్లి మండలం ములపర్రులోని పాఠశాలకు భవనం లేకపోవడంతో చర్చిలో నడుపుతున్నారని, బండ్లగూడెం గ్రామంలో పాఠశాల భవన నిర్మాణానికి స్థలం ఇచ్చినా నిర్మాణం చేపట్టలేదని ఆయా మండలాల జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు వివరించారు. కృత్తివెన్ను మండలం సీతనపల్లిలో పాఠశాల భవనం లేదని కృత్తివెన్ను జడ్పీటీసీ సభ్యురాలు తెలిపారు. వత్సవాయి మండలం భీమవరం పాఠశాలలో టాయిలెట్లు లేవని ఎంపీపీ తెలియజేశారు. నందివాడ మండలం పెదలింగాల పాఠశాలకు వెళ్లే రహదారిపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరిందని, నూతన వంతెన నిర్మించకుండా జాప్యం చేస్తున్నారని నందివాడ ఎంపీపీ సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. పామర్రు, మొవ్వ, గూడూరు మండలాల్లో బీసీ వసతి గృహాల వార్డెన్లకు ఎక్కడెక్కడో అదనపు బాధ్యతలు కల్పించారని సభ్యులు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ పాఠశాలలకు సంబంధించిన భవనాలను త్వరగా పూర్తిచేస్తామన్నారు. గుడివాడ ఏరియా ఆసుపత్రిలో ఇటీవల ఇద్దరు బాలింతలు చనిపోయినా వైద్యశాఖ అధికారులు పట్టించుకోలేదని, కనీస విచారణ కూడా చేయలేదని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. నిమ్మకూరు పాఠశాలలో లెక్కల మాస్టారును నియమించాలని విద్యాశాఖ అధికారులకు ఏడుసార్లు ఫోన్ చేసినా, మూడు సార్లు వినతిపత్రం ఇచ్చినా పట్టించుకోవడంలేదని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పేర్కొన్నారు.

సాగునీటి విడుదలపై ముందుచూపు లేకుంటే ఎలా..?

ఈ ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో సాగునీటి విడుదల అస్తవ్యస్తంగా ఉందని, పామర్రు నియోజకవర్గంలో నాట్లు వేసిన, వేయబోయే పొలాలకు సక్రమంగా సాగునీటిని అందించాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పేర్కొన్నారు. డ్రెయినేజీల్లో పేరుకుపోయిన కిక్కిస, గుర్రపుడెక్క, నాచులను తొలగించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గూడూరు మండలం కంకటావ గ్రామం వద్ద పంటకాల్వపై ఉన్న వంతెన పడిపోయిందని, తూములు ఏర్పాటుచేసినా, అవి పూడుకుపోయి సాగునీరు దిగువకు రావడం లేదని, నూతన వంతెనను నిర్మించాలని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగునీటి విడుదల సక్రమంగా లేదని, భారీ వర్షాలు కురిస్తే కాల్వలను కట్టేసి, అనంతరం రోజుల తరబడి నీటిని విడుదల చేయకుండా నిలిపివేయడంతో నాట్లు వేసిన పొలాలకు, వేయబోయే పొలాలకు సాగునీరు అందుబాటులో లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వరినాట్లు, నారుమడులు పోసుకునే పనులు నిలిచిపోతున్నాయని, ఇదేం పద్ధతి అని ఎమ్మెల్యేలు అధికారులను నిలదీశారు. దీంతోపాటు తాగునీటి చెరువులను కూడా సక్రమంగా నింపలేదని, ప్రధాన పంటకాల్వల్లో, డ్రెయిన్లలో పూడికతీత పనులు కూడా సక్రమంగా చేయడం లేదని ఎమ్మెల్యేలు, పలువురు జడ్పీటీసీ సభ్యులు.. సమావేశం దృష్టికి తెచ్చారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ నీటిపారుదల శాఖ అధికారులు ముందుచూపుతో వ్యవహరించి జిల్లాలో సాగు, తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ కాల్వల నిర్వహణ పనులకు రూ.50 కోట్ల అంచనాతో

- మిగతా 6లో



రింగ రింగా..!

ఎమ్మెల్యేల చుట్టూ తహసీల్దార్ల ప్రదక్షిణలు

బదిలీల్లో గ్రేటర్ విజయవాడ విలీన మండలాలపై దృష్టి

- ఒక్కో పోస్టు కోసం ఆరుగురు చొప్పున పోటీ
- అవాక్కవుతున్న ఎమ్మెల్యేలు
- పోటీగా.. ఆర్ఐ, వీఆర్వోలు కూడా..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : బదిలీలపై సొంత జిల్లాలకు వస్తున్న తహసీల్దార్లు ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఒక్కో మండలానికి అరడజను మంది తక్కువ కాకుండా పోటీ పడుతున్నారు. వచ్చేవారు, వెళ్లేవారితో ఎమ్మెల్యేల కార్యాలయాలు రద్దీగా మారిపోయాయి. తహసీల్దార్ల తాకిడి చూసి ఎమ్మెల్యేలే ఆశ్చర్యపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. మరీ ముఖ్యంగా విజయవాడ గ్రేటర్ విలీన జాబితాలో ఉన్న స్థానాలకు తహసీల్దార్ల నుంచి తీవ్ర పోటీ నెలకొంది.

ఆ స్థానాలకు పోటాపోటీ

ఉమ్మడి కృష్ణాజిల్లాలో విజయవాడ రూరల్ మండలం మొదటి వరుసలో ఉండగా, గన్నవరం మండలం రెండో స్థానంలో ఉంది. ఆ తర్వాత జగ్గయ్యపేట, పెనమలూరు, కంకిపాడు, బాపులపాడు, మైలవరం, గంపలగూడెం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం, గుడివాడ, పెడన, విస్సన్నపేట, రెడ్డిగూడెం మండలాలు ప్రధానంగా ఉన్నాయి. మచిలీపట్నం, అవనిగడ్డ, కంచికచర్ల, పామర్రు మండలాలకు కూడా డిమాండ్ బాగానే ఉంది. విజయవాడ తూర్పు, సెంట్రల్ మండలాలకు పోటీ తీవ్రంగా ఉంది.

సందిగ్ధంలో ఎమ్మెల్యేలు

ఒక్కో పోస్టు కోసం అరడజను మందికి పైగా తహసీల్దార్లు పోటీ పడుతుండటంతో ఎవరిని ఎంపిక చేసుకోవాలో ఎమ్మెల్యేలకు అర్థంకాని పరిస్థితి ఏర్పడింది. ఎమ్మెల్యేలతో పాటు ఉమ్మడి జిల్లాకు చెందిన ఆర్ఐలు, వీఆర్వోలు కూడా ఆయా మండలాలకు వెళ్లడానికి పోటీ పడుతున్నారు. తమకు ఎవరు కావాలో ఎమ్మెల్యేలు ఇప్పటికే నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. కలెక్టర్లకు సిఫార్సు లేఖలు పంపినట్టు సమాచారం. కాగా, ఇప్పటికే తహసీల్దార్లకు మండలాల కేటాయింపు కొలిక్కి వచ్చినట్టుగా తెలుస్తోంది. సోమ, మంగళవారాల్లో కేటాయింపులు జరిగే అవకాశం ఉంది.

దుర్గగుడిలో అంతర్గత బదిలీలు నిలుపుదల

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వన్‌టౌన్, జూలై 27 : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో అంతర్గత బదిలీలను నిలుపుదల చేశారు. ఈ బదిలీల్లో చోటుచేసుకున్న అవకతవకలను వెలికితీస్తూ 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు ప్రచురితమైన విషయం తెలిసిందే. వీటిపై సీఎంవో కార్యాలయ అధికారులు, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే సుజనాచౌదరి స్పందించారు. సీఎంవో కార్యాలయ అధికారులు ఎమ్మెల్యే సుజనాచౌదరితో ఫోన్‌లో మాట్లాడారు. దేవదాయ కమిషనర్ సత్యనారాయణ కూడా స్పందించి ఈవోతో మాట్లాడారు. బదిలీలను నిలుపుదల చేయాలని ఆదేశించారు. దీంతో బదిలీలను తాత్కాలికంగా నిలిపివేశారు.

మా డబ్బు సంగతేంటి..?

ప్రాధాన్యత కలిగిన సీట్లకు తమను పంపాలని కొందరు ఉద్యోగులు ఇప్పటికే కొంత అడ్వాన్సులు చెల్లించారు. బదిలీ ఉత్తర్వులు రద్దు కావడంతో అడ్వాన్సుగా ఇచ్చిన డబ్బు మాటేమిటంటూ మధ్యవర్తిగా ఉన్నవారి వెంటపడుతున్నారు. మీ పోస్టులు మీకే వస్తాయంటూ మధ్యవర్తి ఇంకా సర్దిచెబుతుండటం గమనార్హం.

గుడివాడ ఏరియా ప్రభుత్వాసుపత్రి తీరే వేరు

వైద్యసేవల్లో నిర్లక్ష్యం

- రిస్క్ ప్రసవాలు విజయవాడకు రిఫర్
- ఆస్పత్రిలో చేసేందుకు సిద్ధంగా లేని వైద్యులు
- సాయంత్రం ఆరు దాటితే వైద్యసేవలు బంద్

గుడివాడ ఏరియా ప్రభుత్వాసుపత్రికి జబ్బు చేసింది. గుడివాడ చుట్టుపక్కల ప్రాంతాల వారికి వైద్యసేవలందించేందుకు దీనిని 100 పడకల ఆసుపత్రిగా మార్చినా.. వైద్యసేవల్లో మాత్రం ఇక్కడి సిబ్బంది నిర్లక్ష్యం వీడలేదు. రిస్క్ లేని ప్రసవాలకే ప్రాధాన్యమిచ్చే ఈ ఆసుపత్రిలో.. కాస్త డవుట్ వచ్చినా విజయవాడ ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేసేస్తారు. పైగా చికిత్స కోసం వచ్చే రోగుల పట్ల అమర్యాదగా ప్రవర్తిస్తూ హింసిస్తారు.

6లో..

---

11 నుంచి మచిలీపట్నం-తిరుపతి

రైళ్ల పునరుద్ధరణ

- కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ఎంపీ బాలశౌరి వినతి
- సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి
- మచిలీపట్నం రైల్వేస్టేషన్ అభివృద్ధికి వేడుకోలు

6లో..

సుబ్బారాయుడి పవిత్రోత్సవాలు ప్రారంభం


విశేష అలంకరణలో స్వామివారు

మోపిదేవి, జూలై 27: సుబ్రహ్మణ్యేశ్వరస్వామి పవిత్రోత్సవ సహిత ఆషాఢ కృత్తికా మహోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయ ఈవో ఎన్.ఎస్.చక్రధరరావు, అర్చక బృందం గోపూజ చేసి మహోత్సవాలను ప్రారంభించారు. ప్రధాన అర్చకుడు బుద్దు పవన్ కుమార్ శర్మ, వేద పండితుడు కొమ్మూరి ఫణి కుమార్ శర్మ ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, అభిషేక జలసంగ్రహణం, ఆలయ ప్రదక్షిణ, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహ వచనం, ఋత్విగ్వరణ, పంచగవ్యప్రాసన, అఖండ స్థాపన, వాస్తు మండపారాధన, సుబ్రహ్మణ్య మూలమంత్ర అనుష్ఠానసములను ఋత్వికుల బృందం శాస్త్రోక్తంగా జరిపింది.

దుర్గమ్మ సేవలో హైకోర్టు న్యాయమూర్తి సుజాత


జస్టిస్ సుజాతకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో రామారావు

వన్‌టౌన్: ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను కుటుంబసభ్యులతో కలిసి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత శనివారం దర్శించుకున్నారు. ఈవో రామారావు ఆలయమర్యాదలతో వారికి స్వాగతం పలికారు. దర్శనానంతరం శేషవస్త్రం, ప్రసాదం, అమ్మవారి చిత్రపటం అందజేశారు. పండితులు ఆశీస్సులందించారు.


మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర, కృష్ణా కలెక్టర్ బాలాజీ

జిల్లా అభివృద్ధికి సమన్వయంతో పనిచేయండి

▸▸ అధికారులు, ప్రజా ప్రతినిధులతో మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జూలై 27: కృష్ణాజిల్లా సమగ్రాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు. శనివారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్సు హాలులో ఎమ్మెల్యేలు, కలెక్టర్ డీకే బాలాజీ, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, జిల్లా అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉపాధి పనులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, వర్ల కుమార్‌రాజా, యార్లగడ్డ వెంకట్రావు, డీఆర్వో కె.చంద్రశేఖర రావు, ఆర్డీవో వాణి, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, పంచాయతీరాజ్ ఎస్ఈ విజయకుమారి, ఆర్అండ్‌బీ ఈఈ శ్రీనివాసరావు, డీపీవో నాగేశ్వర నాయక్, సీపీవో గణేష్ పాల్గొన్నారు.

జిల్లా ప్రభుత్వాస్పత్రిలో ఆధునిక వైద్య పరికరాలు ప్రారంభం

మచిలీపట్నం జిల్లా ప్రభుత్వాస్పత్రి నేత్ర విభాగంలో రూ.కోటి విలువైన ఆధునిక వైద్య పరికరాలను మంత్రి కొల్లు రవీంద్ర ప్రారంభించారు. మెల్ల కన్ను సమస్యతో బాధపడేవారికి శస్త్రచికిత్స కోసం ఆస్పత్రిలో పరికరాలు ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. వైద్యుల నియామకానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ రమేష్‌కుమార్, కంటి వైద్యుడు భానుమూర్తి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, మునిసిపల్ మాజీ చైర్మన్ బాబాప్రసాద్, టీడీపీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

నికృష్టపాలకుడు జగన్

▸▸ ఏడు శ్వేతపత్రాలు ఆయన అధ్వాన పాలనకు ప్రతిబింబాలు

▸▸ విలేకరుల సమావేశంలో నెట్టెం రఘురాం ధ్వజం

జగ్గయ్యపేట, జూలై 27: "శాసనసభను ఎదుర్కోలేని స్థితిలో మాజీ ముఖ్యమంత్రి, పులివెందుల ఎమ్మెల్యే జగన్మోహన్‌రెడ్డి ఉన్నారు. అసెంబ్లీ సమావేశాలకు రాకుండా పిరికివాడిలా పారిపోయారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఏడు శ్వేతపత్రాలు జగన్ నికృష్ట, నీచ, అధ్వాన పాలనకు అద్దం పడుతున్నాయి." అని టీడీపీ విజయవాడ పార్లమెంట్ అధ్యక్షుడు నెట్టెం రఘురాం విమర్శించారు. శనివారం పట్టణంలోని తన నివాసంలో నెట్టెం విలేకరులతో మాట్లాడారు. జగన్ రివర్స్ టెండరింగ్ వల్ల పోలవరం ప్రాజెక్టుకు రూ.45వేల కోట్ల నష్టం వాటిల్లిందన్నారు. అదనంగా రూ.4900కోట్లు మరమ్మతులకు వెచ్చించాల్సి వచ్చిందని, విద్యుదుత్పత్తి జరగక పరోక్షంగా రూ.3 వేల కోట్లు నష్టం వచ్చిందని తెలిపారు. అమరావతిపై కక్షగట్టి విధ్వంసం చేశారన్నారు. దీంతో రూ.3లక్షల కోట్లు నష్టం వాటిల్లిందని, ఐదేళ్లలో అనుకున్న విధంగా పూర్తిచేస్తే 7లక్షల మందికి ఉపాధి కలిగేదని అన్నారు. విద్యుత్ పీపీఏలను అనాలోచితంగా రద్దు చేసి అధిక ధరలకు విద్యుత్‌ను కొనుగోలు చేసి జగన్ రూ.9వేల కోట్ల నష్టం తెచ్చాడన్నారు. ఇసుకను తన సొంత కంపెనీకి ఇచ్చి లెక్కాపత్రం లేకుండా అనధికార రవాణా చేసి, రాష్ట్రంలో ఆకలికేకలతో భవన నిర్మాణ కార్మికులు అనుబంధ రంగాల వారు అలమటించేలా చేశాడన్నారు. ఇసుకలో రూ.10వేల కోట్లను దోచుకున్నాడన్నారు. జగన్ మనుషులు, మంత్రులు వేల ఎకరాల నిషేధిత భూములను కబ్జా చేశారని, రికార్డులు దొరక్కుండా రెవెన్యూ కార్యాలయాలను దహనం చేశారని ఆరోపించారు. ఎంపీ విజయసాయిరెడ్డి వైజాగ్‌లో చేసిన లీలలను ప్రజలు కథలుగా చెప్పుకొంటున్నారన్నారు. మద్యంలో నగదు రూపంలో జరిగిన రూ.99 వేల కోట్లు లావాదేవీలు ఎవరి జేబుల్లోకి వెళ్లాయో తెలియడం లేదన్నారు. రాష్ట్రానికి రూ.9.74లక్షల కోట్లు అప్పు ఉందని, పెండింగ్‌లో రూ.1.30లక్షల కోట్లు ఉన్నాయని, అవికాక మరో లక్ష కోట్లుఉన్నాయని తెలుస్తోందని నెట్టెం అన్నారు. రూ.12.93లక్షల కోట్లు ఆర్థిక విధ్వంసం జరిగిందని నెట్టెం ఆరోపించారు. ఆ విధ్వంసం నుంచి రాష్ట్రం కోలుకోవటానికి చాలా సమయం పడుతుందన్నారు.

జగన్ పాలనలో రూ.12.93 లక్షల కోట్ల

ఆర్థిక విధ్వంసం: దేవినేని ఉమా

గొల్లపూడి, జూలై 27: ఐదేళ్లలో మాజీ ముఖ్యమంత్రి జగన్ రూ.12,93,216 కోట్ల ఆర్థిక విధ్వంసం చేశారని మాజీమంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు ఆరోపించారు. గొల్లపూడిలో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రజలపై 9,74,556 కోట్ల భారం మోపాడని దుయ్యబట్టారు. అడ్డగోలుగా అప్పులు చేసి ప్రభుత్వ ఆస్తులు తాకట్టు పెట్టాడన్నారు. ప్రజలు 11 సీట్లకు జగన్‌ను పరిమితం చేస్తే ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వండని సిగ్గులేకుండా న్యాయస్థానాలకు ఎక్కాడన్నారు. ప్రజలను నమ్మించేందుకు తాడేపల్లి ప్యాలెస్‌లో ఉండి మాట్లాడుతున్నాడన్నారు. మీడియా ముందుకు వచ్చి మాట్లాడే దమ్ము, ధైర్యం జగన్‌కు లేదన్నారు. ప్రజలకు సూపర్‌సిక్స్ పథకాలు చేరేలా టీడీపీ కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు.

11 నుంచి తిరుపతి,

విశాఖపట్నం రైళ్ల పునరుద్ధరణ

▸▸ రైల్వే మంత్రి అశ్వినివైష్ణవ్ హామీ ఇచ్చారన్న ఎంపీ బాలశౌరి

మచిలీపట్నం, జూలై 27(ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం నుంచి తిరుపతి, విశాఖపట్నానికి ఆగస్టు 11వతేదీ నుంచి రైళ్లను పునరుద్ధరిస్తామని రైల్వేశాఖ మంత్రి అశ్వినివైష్ణవ్ హామీ ఇచ్చారని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెండు రైళ్లను పునరుద్ధరించాలని అశ్వినివైష్ణవ్‌ను శనివారం ఢిల్లీలో కలిసి వినతిపత్రం అందించామని ఆయన పేర్కొన్నారు. మచిలీపట్నం- విజయవాడ మధ్య నడిచే పలు రైళ్లను వడ్లమన్నాడు రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం నిలపాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ప్రతిపాదనలో ఉన్న వంతెనలు, గేట్లతోపాటు, పది ప్రాంతాల్లో రైల్వేఓవర్, అండర్‌బ్రిడ్జిల పనులను త్వరితగతిన ప్రారంభించి పూర్తిచేయాలని మంత్రిని కోరినట్లు ఎంపీ తెలిపారు. మచిలీపట్నం రైల్వేస్టేషన్‌కు ప్రత్యేకంగా నిధులు కేటాయించి కనీస మౌలికవసతులు, సుందరీకరణ పనులు చేయాలని రైల్వేమంత్రిని కోరినట్లు తెలిపారు.

వైద్యసేవల్లో నిర్లక్ష్యం

▸▸ రిస్క్ ప్రసవాలు విజయవాడకు రిఫర్

▸▸ ఆస్పత్రిలో చేసేందుకు సిద్ధంగా లేని వైద్యులు

▸▸ సాయంత్రం ఆరు దాటితే వైద్యసేవలు బంద్

▸▸ గుడివాడ ఏరియా ప్రభుత్వాస్పత్రి తీరిది

గుడివాడ: గుడివాడ చుట్టుపక్కల ప్రజలకు వైద్య సేవలందించేందుకు ఏరియా ప్రభుత్వాస్పత్రిని 100 పడకల ఆస్పత్రిగా మార్చారు. ఆస్పత్రి అభివృద్ధి చెంది నూతన భవనాల్లోకి మారింది గానీ వైద్యసేవల్లో వైద్యుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. సాయంత్రం 6గంటలు దాటితే వైద్యసేవలు బంద్ చేస్తారు. గర్భిణులకు రిస్క్ లేని ప్రసవాలకే వైద్యాన్ని అందిస్తారు. ప్రసవ సమయంలో ఏ చిన్న రిస్క్ వచ్చినా దానిని చాలెంజ్‌గా తీసుకుని వైద్య సేవలందించడానికి ఇక్కడి వైద్యులు సిద్ధంగా లేరు. గర్భిణిని విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాలని కుటుంబసభ్యులపై సిబ్బంది ఒత్తిడి తెస్తారు. తల్లీబిడ్డల్లో ఒకరికి ప్రమాదమని భయపెడతారు. చివరికి విజయవాడ వెళ్లేటట్టు చేస్తారు. ఇటీవల గుడివాడ మండలం మల్లాయిపాలెం గ్రామానికి చెందిన గర్భిణీకి ఇదే పరిస్థితి ఎదురైంది. ఏడాదిలో 20 రిస్క్ ప్రసవాలు ఆస్పత్రికి వస్తే అన్నింటినీ విజయవాడకు రిఫర్ చేశారు. శుక్రవారం కూడా రిస్క్ ప్రసవం ఆస్పత్రికి వస్తే విజయవాడకు రిఫర్ చేసినట్టు సమాచారం.


గుడివాడ ఏరియా ప్రభుత్వాస్పత్రి (ఫైల్)

అమర్యాదకర ప్రవర్తన

వైద్యం కోసం వచ్చిన రోగుల పట్ల కొందరు వైద్యులు, నర్సులు అమర్యాదగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలున్నాయి. వారం క్రితం గుడ్లవల్లేరు మండలానికి చెందిన గర్భిణీకి ఇక్కడ సిజేరియన్ అయ్యింది. 10రోజుల్లోనే బాలింత మృతి చెందింది. దీంతో పసికందు అనాథగా మిగిలిపోయింది. బాలింత మృతికి కారణాలు చెప్పేవారు లేరు.

జగన్ ప్రభుత్వ నిర్వాకంతోనే పెదవాగుకు భారీ నష్టం

▸▸ తెలంగాణ ప్రభుత్వంతో చర్చించి శాశ్వత మరమ్మతులు:

నీటిపారుదల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు

అశ్వారావుపేట, జూలై 27: రాష్ట్రాన్ని గత ప్రభుత్వ పాపం వెంటాడుతోందని, పెదవాగు ప్రాజెక్టుకు గండి పడి 12వేల ఎకరాల్లో పంటలు, భారీ ఆస్తి నష్టానికి జగన్ ప్రభుత్వంలో అవలంబించిన నిర్లక్ష్యవైఖరే కారణమని నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. శనివారం రాష్ట్ర పరిధిలోని వేలేరుపాడు మండలంలో గోదావరి వరద, పెదవాగు నిర్వాసిత ప్రాంతాన్ని పరిశీలించడానికి వెళుతూ మంత్రులు రామానాయుడు, వంగలపూడి అనిత, కె.అచ్చెన్నాయుడు, కె.పార్థసారథి, పోలవరం, దెందులూరు ఎమ్మెల్యేలు చిర్రి బాలరాజు, చింతమనేని ప్రభాకర్ అశ్వారావుపేటలోని కెమిలాయిడ్స్ గెస్ట్ హౌస్‌లో కొద్దిసేపు ఆగారు. ఏపీ, తెలంగాణకు చెందిన పలువురు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు మంత్రులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విలేకరులతో వారు మాట్లాడారు. పెదవాగు ప్రాజెక్టును 2021లోనే గోదావరి బోర్డు స్వాధీనం చేసుకుని శాశ్వత మరమ్మతులకు రూ.80కోట్లు అంచనావేసి అనుమతులిచ్చిందని, అయితే అప్పటి సీఎం జగన్ ఈ ప్రాజెక్టుకు ఒక్కపైసా కూడా కేటాయించకపోవడంవల్ల నేడు ఈ భారీనష్టానికి దారి తీసిందని తెలిపారు. భారీగా పంటలు, పొలాలు నీట మునిగాయని, ఈ ఏడాది 12000 ఎకరాల్లో పంటలు వేయలేని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఆస్తులు, పశునష్టం జరిగిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం రూ.3.50కోట్లతో తాత్కాలిక మరమ్మతులు చేపడుతోందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వంతో రాష్ట్ర ప్రభుత్వం చర్చించి రాష్ట్ర రైతులకు ఏ విధంగా న్యాయం చేయాలి..ప్రాజెక్టు శాశ్వత మరమ్మతులు ఎలా చేపట్టాలి..తాత్కాలిక మరమ్మతులతో చేయగలమా..అనేది చర్చిస్తున్నామన్నారు. త్వరలోనే ఓ నిర్ణయం తీసుకొంటామని మంత్రులు తెలిపారు.


విలేకరులతో మాట్లాడుతున్న మంత్రులు అనిత, అచ్చెన్నాయుడు, రామానాయుడు, పార్థసారథి


పసుమర్తి కామేశ్వరశర్మ (ఫైల్), పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమా

పసుపర్తి కామేశ్వరశర్మ కన్నుమూత

▸▸ గుండెపోటుతో తుదిశ్వాస విడిచిన ఆధ్యాత్మిక ప్రవచనకర్త

విజయవాడ లీగల్, జూలై 27: ఆధ్యాత్మిక ప్రవచనకర్త, శాస్త్ర, జ్యోతిష్య పండితుడు, విజయవాడ ఎలక్ట్రికల్ డీలర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పసుమర్తి కామేశ్వరశర్మ శనివారం తెల్లవారుజామున అయోధ్యనగర్‌లోని ఆయన స్వగృహంలో గుండెపోటుతో కన్నుమూశారు. శర్మకు భార్య రాజేశ్వరి, కుమారుడు, ముగ్గురు కుమార్తెలున్నారు. కామేశ్వరశర్మ సంస్కృతాంధ్ర సాహిత్యాలు, సంగీత జ్యోతిష్యాది శాస్త్రాల్లో నిష్ణాతుడు. ఆకాశవాణి, దూరదర్శన్‌లలో ప్రవచనాలు చెప్పేవారు. 2023 ఏప్రిల్ 16న సౌత్‌ఆఫ్రికా తెలుగు అసోసియేషన్, జయహో భారతీయం సంస్థలు 'తెలుగు రత్న' పురస్కారం ఇచ్చి శర్మను సత్కరించాయి. 30 ఏళ్లుగా ఉచితంగా అందరికీ జ్యోతిష్యం చెబుతున్నారు. చివరిగా ఈనెల 20వ తేదీన శారదా ఎడ్యుకేషన్ సొసైటీ ఆయనకు గురుపూజ చేసి 'సద్గురు' బిరుదుతో సత్కరించింది. ఆయన కుమారుడు అమెరికాలో ఉండడంతో అంత్యేష్టి కర్మలు సోమవారం నిర్వహిస్తామని కుటుంబసభ్యులు తెలిపారు. శర్మ పార్థివదేహానికి ఎమ్మెల్యే బొండా ఉమా శ్రద్ధాంజలి ఘటించారు. కామేశ్వర శర్మ లేని లోటు తీర్చలేనిదని బెజవాడ బార్ అధ్యక్ష, కార్యదర్శులు కొత్త చంద్రమౌళి, అరిగల శివ రాంప్రసాద్(రాజా) అన్నారు. కామేశ్వరశర్మ మృతితో మధురవాక్కు మూగబోయిందని సీఎం చంద్రబాబు సెక్రటరీ రాజమౌళి ఆవేదన వ్యక్తంచేశారు. రాశిఫలాలు ఆయనంత మధురంగా చెప్పడం తానెక్కడా చూడలేదన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకున్నారు.


ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, గొండు శంకర్‌ను సన్మానిస్తున్న సర్పంచ్‌లు

సర్పంచ్‌ల పోరాటంతో వైసీపీ అడ్రస్ గల్లంతు

▸▸ పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్

గవర్నర్‌పేట, జూలై 27: "కేంద్ర ప్రభుత్వం గ్రామపంచాయతీలకు పంపిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం తన సొంత అవసరాలకు వాడుకుంది. సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులకు విలువ లేకుండా చేసింది. టీడీపీ కూటమి ప్రభుత్వం ఆ నిధులు వెంటనే విడుదల చేయాలి. చాంబర్, సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు చేసిన కారణంగానే ఎన్నికల్లో వైసీపీ అడ్రస్ లేకుండా పోయింది." అని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్, ఆంధ్రప్రదేశ్ సర్పంచ్‌ల సంఘంలో సభ్యులుగా ఉండి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు మురళీని శనివారం విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో సన్మానించారు. సర్పంచ్ నుంచి ఎంపీగా ఎన్నికైన కలిశెట్టి అప్పలనాయుడుకు అభినందనలు తెలిపారు. వైవీబీ రాజేంద్రప్రసాద్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షురాలు వానపల్లి లక్ష్మీ ముత్యాలరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. "నిబద్ధత గల నాయకుడి వద్ద పనిచేస్తే గుర్తింపు దానంతట అదే వస్తుంది. రాజేంద్రప్రసాద్ సంఘంలో పనిచేయడం ద్వారా గ్రామాల సమస్యలపై పూర్తి అవగాహన వచ్చింది. పార్టీ గుర్తించి సీటు ఇచ్చింది" అని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. ఎమ్మెల్యేగా పోటీ చేయాలని ఎప్పటి నుంచో ఉన్నా పోటీచేసి గెలుపొందడానికి స్ఫూర్తిని రాజేంద్రప్రసాద్ ఇచ్చారని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. చాంబర్‌కు, సర్పంచ్‌ల సంఘానికి సహాయ సహకారాలందిస్తామని ఎమ్మెల్యేలిద్దరూ హామీ అన్నారు. చాంబర్ సభ్యులు, సర్పంచ్‌ల సంఘ నేతలు, పెద్ద సంఖ్యలో సర్పంచ్‌లు పాల్గొన్నారు.

క్లిష్టమైన వ్యాధులకు ప్రభుత్వాస్పత్రిలో చికిత్సలు

▸▸ కార్డియాలజీ విభాగ వైద్యుడు బి.విజయచైతన్య


మాట్లాడుతున్న డాక్టర్ బి.విజయచైతన్య

ప్రభుత్వాసుపత్రి, జూలై 27: అనతికాలంలోనే అతి క్లిష్టమైన వ్యాధులకు సైతం చికిత్స అందించేస్థాయికి విజయవాడ ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి చెందిందని కార్డియాలజీ విభాగంలో ప్రధాన వైద్యుడు బి.విజయచైతన్య తెలిపారు. శనివారం ప్రభుత్వాస్పత్రిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిడమానూరుకు చెందిన గోపాలకృష్ణ(66) ఛాతీనొప్పితో ప్రైవేట్ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారని, వైద్యులు యాంజియోగ్రామ్ చేసి, గుండె నరాల్లో 90 శాతం కాల్షియం బ్లాక్స్ ఉన్నాయని నిర్ధారించారని తెలిపారు. వైద్యానికి రూ.7 లక్షల నుంచి రూ.8 లక్షలు అవుతుందని చెప్పడంతో ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగా ఉన్న గోపాలకృష్ణ ప్రభుత్వాస్పత్రికి వైద్యం కోసం వచ్చారన్నారు. రోటాబ్లేషన్ పద్ధతి కట్టింగ్ బెలూన్ ప్రొసీజర్ అనే ఆధునిక పద్ధతిలో బ్లాక్స్‌ను తొలగించి స్టంట్ వేశామన్నారు. చిలకలూరిపేటకు చెందిన ఎస్.సుధీన్‌బేగంకు ఎడమ చేతివేళ్లు కుళ్లిపోయిన స్థితిలో ఆస్పత్రిలో చేరగా లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని ప్రైవేట్ వైద్యులు తెలిపారని, ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉన్న ఆమె రెండునెలలుగా వ్యాధి ముదిరాక చివరికి నగరంలోని ప్రభుత్వాస్పత్రిలో చేరిందన్నారు. ఆమెకు ప్లాస్టిక్ సర్జరీ నిపుణుడు సీటీ పెరిఫెరల్ యాంజియోగ్రాం చేసి ఎడమ ఛాతీభాగం నుంచి భుజంలోకి వచ్చే రక్తనాళంలో లెఫ్టసబ్‌క్లేవియన్ ఆర్టెరీలో 90 శాతం నుంచి 95 శాతం రక్తనాళంలో అడ్డంగా ఉన్నట్లు నిర్ధారించినట్లు తెలిపారు. ఖర్చుతో సంబంధం లేకుండా ఎన్టీఆర్ వైద్య పథకం ద్వారా ఎడమ చేతి రక్తనాళం పునరుద్ధరించి స్టంట్ వేసి అతిక్లిష్టమైన ప్రక్రియను ఆస్పత్రి వైద్యబృందం విజయవంతంగా చికిత్సను పూర్తిచేసిందన్నారు. సమావేశంలో సేఫ్‌క్యూర్ ల్యాబ్ డైరెక్టర్ పర్చూరి సాయికుమార్, వైద్యులు కావ్య శ్రీహరి, నాగేశ్వరరావు, మురళీకృష్ణ పాల్గొన్నారు.


క్వారీ మృతుల కుటుంబాలకు

పరిటాల రాతి క్వారీ వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నేతలు

రూ.50 లక్షల పరిహారమివ్వాలి

కంచికచర్ల రూరల్, జూలై 27: పరిటాల రాతిక్వారీలో జరిగిన ప్రమాదంలో మృతిచెందిన వారి ఒక్కొక్కరి కుటుంబానికి రూ.50 లక్షల చొప్పున పరిహారం అందించాలని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనెపూడి శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం క్వారీని సీపీఐ జిల్లా బృందం పరిశీలించి, ధర్నా చేసింది. జిల్లాలో భద్రతాప్రమాణాలు పాటించని పరిశ్రమల్లో వరుసగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. కార్మికుల జీవితాలకు భద్రత లేకుండా పోయిందని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం 99 క్వారీలకు అనుమతి ఇస్తే అనధికారికంగా మరో 50క్వారీలు నడుస్తున్నాయన్నారు. క్వారీలో చనిపోయిన రాందేవ్ బాగేల్ కుటుంబానికి రూ.16,89,150 పరిహారం ఇవ్వాలని కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆదేశించి వారాలు దాటినా ఇప్పటి వరకు పరిహారం అందలేదన్నారు. మృతుల కుటుంబాలను అధికార, ప్రతిపక్షనాయకులు ఎవ్వరూ పరామర్శించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఆగస్టు 2న క్వారీ ప్రమాదాలు, కాలుష్యంపై ఇబ్రహీంపట్నం రింగ్‌లో ధర్నా చేస్తామని శంకర్ తెలిపారు. ధర్నాను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బుడ్డి రమేష్, చుండూరు సుబ్బారావు, పరుచూరి రాజేంద్ర బాబు, మల్నీడు యలమందలరావు, రాయప్ప తదితరులు పాల్గొన్నారు.

ఈఎన్‌సీ వీడ్కోలు సభకు

విరాళాలు కోరడం లేదు

▸▸ ఫంక్షన్ పేరుతో వసూళ్లు చేసే వారితో అప్రమత్తంగా ఉండండి

▸▸ ఏపీఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జీఎల్‌డీవీ సంతోష్‌రెడ్డి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): గ్రామీణ నీటి సరఫరా విభాగం(ఆర్‌డబ్ల్యూఎస్) ఈఎన్‌సీ ఆర్వీ కృష్ణారెడ్డి పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా నిర్వహించే వీడ్కోలు సమావేశం కోసం ఇంజనీరింగ్ సభ్యులు, జిల్లా శాఖల నుంచి విరాళాలుగా కానీ, ఇతర రూపాల్లో గానీ ఏమీ కోరటం లేదని ఏపీఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జీఎల్‌డీవీ సంతోష్‌రెడ్డి తెలిపారు. 'విరమణ పేరిట సమర్పణ' అన్న శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. తమ సంఘం పేరుతో ఎవరైనా వసూళ్లు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇంజనీర్ల సంఘం పేరుతో ఎవరైనా వసూలు చేసి ఉంటే వారికి సంఘానికి సంబంధం లేదన్నారు. సంఘం తరపున వసూళ్లు చేసే వారిపై జిల్లా శాఖలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సంఘం తరపున ఈఎన్‌సీకి ఎలాంటి విలువైన కానుకలు ఇవ్వటం లేదని తెలిపారు.

జిల్లా అభివృద్ధి కోసం కలిసికట్టుగా..

(ఐదో పేజీ తరువాయి)

నివేదికలు పంపగా, రూ.26 కోట్ల పనులకే ఆమోదం లభించిందన్నారు. అనుమతులు ఇచ్చిన కాల్వల నిర్వహణ పనులను తానే బాధ్యత తీసుకుని చేయిస్తానన్నారు. వీటికి కాంట్రాక్టు పనులను అప్పగించేందుకు ఇంకా పూర్తిస్థాయి ఆమోదం రాలేదని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల పరిధిలో జాతీయ రహదారి 216పై ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ఆయా ప్రాంతాల్లో వాహనాల వేగం తగ్గించేందుకు పోలీస్ పెట్రోలింగ్, బారికేడ్లను ఏర్పాటు చేయాలని అధికారులకు మంత్రి కొల్లు సూచించారు. తోట్లవల్లూరు నుంచి రొయ్యూరు వరకు కరకట్టకు ఇరువైపులా ముళ్లచెట్లు పెరిగి వాహనాల రాకపోకలకు అంతరాయంగా ఉందని, వాటిని తొలగించాలని తోట్లవల్లూరు జడ్పీటీసీ సభ్యుడు అధికారులను కోరారు. పలు అభివృద్ధి పనుల నిమిత్తం జడ్పీటీసీ సభ్యులకు ఏడాదికి రూ.20 లక్షల చొప్పున నిధులు కేటాయిస్తారని, పలు పనులు చేసి ఎం-బుక్‌లో రికార్డు చేసినా బిల్లులు మంజూరు చేయడంలేదని సభ్యులు జడ్పీ చైర్‌పర్సన్ హారిక దృష్టికి తీసుకొచ్చారు. ఆమె మాట్లాడుతూ బిల్లులు త్వరలో చేయిస్తానని హామీ ఇచ్చారు. జిల్లాలో తాగునీటి పథకాల నిమిత్తం జడ్పీ నుంచి ఏడాదికి రూ.39.50 కోట్లను మంజూరు చేస్తున్నా తాగునీటిని సక్రమంగా అందించకపోవడం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల నిర్లక్ష్యమేనన్నారు.

అధికారుల తీరు మారాల్సిందే

▸▸ జడ్పీ సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: కృష్ణాజిల్లాలో పనిచేస్తున్న అధికారుల పనితీరుపై మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో శనివారం జడ్పీ సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 50రోజులపైనే అయిందని, కలెక్టర్ మినహా మిగిలిన అధికారుల తీరు మారలేదని, తమకు కనీస సమాచారం ఇవ్వడం లేదని వారు అన్నారు. సమస్యలపై అధికారులతో మాట్లాడితే రూల్ పొజిషన్ చెబుతున్నారే తప్ప, సమస్యలను పరిష్కరించేందుకు ఆసక్తి చూపడం లేదని ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు.

ఇప్పటికీ కొందరు అధికారులు వైసీపీ నాయకులకు అనుకూలమే

వైసీపీ నాయకులకు మేలుచేయాలని కొందరు అధికారులు గతంలో మచిలీపట్నం నియోజకవర్గంలో దొంగ ఇంటి పట్టాలను విచ్చలవిడిగా మంజూరు చేశారు. దీనిపై ఇప్పటికే విచారణకు ఆదేశించాం. మరికొందరు నేటికీ వైసీపీ నాయకులకు అనుకూలంగానే పనిచేస్తున్నారు. వారు రాష్ట్రంలో ఎక్కడ పనిచేసినా వదలిపెట్టం. కృత్తివెన్ను, బంటుమిల్లి మండలాల్లో భూఆక్రమణలు, ఇతరత్రా అంశాల్లో నిజాలు వెలుగులోకి రాకుండా వైసీపీ నాయకులకు అనుకూలంగా కొందరు రెవెన్యూ అధికారులు పనిచేస్తున్నారు. కలెక్టర్ దృష్టిసారించాలి. **- మంత్రి కొల్లు రవీంద్ర**

తీరప్రాంతానికి సాగునీరందించాలి



వైసీపీ ప్రభుత్వ హయాంలో సాగునీటిని సక్రమంగా విడుదల చేయకపోవడంతో అవనిగడ్డ నియోజకవర్గంలోని కోడూరు, నాగాయలంక మండలాల్లో 5వేల ఎకరాల్లో గతేడాది పంటలు సాగుచేయలేదు. ఈ ఏడాదీ అదే పరిస్థితి ఉండేలా నీటి పారుదలశాఖ అధికారుల వ్యవహారశైలి కనిపిస్తోంది. అవనిగడ్డ నియోజకవర్గంలో అవుట్‌ఫాల్ స్లూయిస్‌ల నిర్మాణానికి అంచనాలు ఇప్పటికీ రూపొందించకపోతే ఎలా? డ్రెయినేజీలు, పంటకాలువల నిర్వహణ పనులను సక్రమంగా చేయడం లేదు.

- మండలి బుద్ధప్రసాద్, అవనిగడ్డ ఎమ్మెల్యే

అధికారులు అందుబాటులో ఉండరు



జిల్లాలో కలెక్టర్ మినహా మిగిలిన అధికారులెవరూ ఎమ్మెల్యేలకు అందుబాటులో ఉండటం లేదు. ప్రజాసమస్యలను పరిష్కరించాలని కోరితే అధికారులు సరైన విధంగా స్పందించడం లేదు. మల్లవల్లిలో పారిశ్రామికవాడలో పరిశ్రమల అభివృద్ధికి సహరించాలి.

- యార్లగడ్డ వెంకట్రావ్, గన్నవరం ఎమ్మెల్యే

తాగునీటి చెరువులు నింపలేదు



ఇటీవల జిల్లాలో భారీవర్షాలు కురిశాయి. కాలువలకు తాగునీటి అవసరాలకోసం నీటిని విడుదల చేశారు. అయినా తాగునీటి చెరువులు నింపలేదు. ప్రశ్నిస్తే కాలువలద్వారా నీరు రావడంలేదని నీటిపారుదలశాఖ అధికారులు చెబుతున్నారు. అధికారులు ఇంకా వైసీపీ నాయకుల బాటలోనే ప్రయాణం చేయడం బాధాకరం. ఎమ్మెల్యేలకు అధికారులు అందుబాటులో ఉండాలి. గుడివాడ ఏరియా ఆస్పత్రిలో ఇటీవల ఇద్దరు బాలింతలు మరణిస్తే వారు ఏ కారణాలతో మరణించారో వైద్యశాఖ అధికారులు తెలుసుకునే ప్రయత్నం చేయలేదు.

- వెనిగండ్ల రాము, గుడివాడ ఎమ్మెల్యే

సాగునీరు సక్రమంగా అందించడం లేదు



సాగునీటి విడుదలలో నీటిపారుదలశాఖ అధికారులకు సరైన అంచనాలు లేవు. పామర్రు నియోజకవర్గంలోని పంటపొలాలకు సాగునీటిని అందించాలని కోరితే అధికారులు స్పందించడం లేదు. నియోజకవర్గంలోని ఐనంపూడి డ్రెయిన్‌లో పూడికతీయాలని చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదు. విద్యాశాఖ అధికారులు తీరు మరీ విడ్డూరంగా ఉంది. నిమ్మకూరు పాఠశాలలో లెక్కల మాస్టారును మరో పాఠశాలకు పంపారు. ఈ మాస్టారును ఇక్కడకు పంపాలని విద్యాశాఖ అధికారులకు మూడుసార్లు వినతిపత్రాలుఇచ్చినా, ఏడుసార్లు ఫోన్‌లో మాట్లాడినా ఇంతవరకు ఉపాధ్యాయుడిని ఏర్పాటు చేయలేదు.

- వర్ల కుమార్‌రాజా, పామర్రు ఎమ్మెల్యే

రూల్‌పొజిషన్ చెప్పి తప్పించుకుంటున్నారు



పెడన నియోజకవర్గం మొత్తం వ్యవసాయం, ఆక్వాసాగు ఆధారిత ప్రాంతం. గ్రామాల్లో సమస్యలపై అధికారులతో మాట్లాడితే రూల్ పొజిషన్ చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. పరిష్కరించేందుకు ముందుకు రావడం లేదు. కాలువ శివారు ప్రాంతంలో ఉన్న పెడన నియోజకవర్గంలోని మండలాలకు సాగునీటిని అందించకుండా అధికారులు జాప్యం చేస్తున్నారు. రైతుల ఇబ్బందులను పట్టించుకోవడం లేదు.

-కాగిత కృష్ణప్రసాద్, పెడన ఎమ్మెల్యే

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	104, 113, 124
చికెన్ విత్ స్కిన్	196
చికెన్ స్కిన్‌లెస్	206



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.80

కె.సీతారాంపురంలో సచివాలయం ఏర్పాటు చేయాలి



హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 27 : గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో కె.సీతారాంపురం గ్రామ సచివాలయాన్ని ఎస్.ఎన్.పాలెంలో కలిపి వేయడంతో సచివాలయ పనుల నిమిత్తం ప్రజలు ఇబ్బందులెదుర్కొంటున్నారని, గ్రామంలో సచివాలయం ఏర్పాటు చేయాలని కోరుతూ సర్పంచ్ చెన్నుబోయిన మహలక్ష్మి ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం వినతిపత్రం అందజేశారు. కె.సీతారాంపురం గ్రామ ప్రజాప్రతినిధులతో కలిసి శనివారం వినతిపత్రాన్ని సీనియర్ అసిస్టెంట్ దమయంతికి అందజేశారు.

మత్తుతో భవిష్యత్తు చిత్తు

ప్రముఖ సైకియాట్రిస్టు పెద్దు ప్రదీప్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ పెద్దు ప్రదీప్

ఉయ్యూరు, జూలై 27 : విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకోవాలిసిన తరుణంలో మత్తుపదార్థాలు, మాదక ద్రవ్యాలకు అలవాటుపడితే భవిష్యత్తు చిత్తై బంగారంలాంటి బతుకు బూడిద కన్నా హీనమవుతుందని ఇంగ్లాండ్‌లో స్థిరపడిన ఉయ్యూరుకు చెందిన ప్రముఖ సైకియాట్రిస్టు పెద్దు ప్రదీప్ అన్నారు. శ్రీజ్యోతి చారిటబుల్ ట్రస్టు, ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల ఆధ్వర్యంలో శనివారం కళాశాల కాన్ఫరెన్స్ హాల్‌లో మాదకద్రవ్యాలు - యువతపై వాటి ప్రభావం అనే అంశంపై కళాశాల విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, యుక్త వయస్సులో తెలిసి తెలియక మత్తుకు అలవాటు పడితే వ్యసనంగా మారి జీవితం సర్వనాశనం అవుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్ అధ్యక్షతన జరిగిన సదస్సులో ప్రత్యేక అధికారి కె.సత్యనారాయణ, జ్యోతి చారిటబుల్‌ట్రస్టు జనరల్ సెక్రటరీ కె.స్వరూపరాణి, కోశాధికారి నీరజ, లయన్స్ క్లబ్ ఉయ్యూరు అధ్యక్షుడు నేరెళ్ల తేజసాయి వెంకట్ పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థికసాయం



జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో సాయం అందజేస్తున్న సురేంద్ర, రవీంద్ర

ఉయ్యూరు, జూలై 27 : పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న నాగరాజు కుటుంబానికి రూ. 65 వేల ఆర్థికసాయాన్ని జిల్లా ఎస్పీ గంగాధర్ ఆధ్వర్యంలో శనివారం అందజేశారు. 2003 బ్యాచ్‌కు చెందిన నాగరాజు 2023లో అనారోగ్యంతో మృతి చెందాడు. అదే బ్యాచ్ సిబ్బంది సురేంద్ర, రవీంద్ర, శ్రీనివాస్, కిరణ్ ఇతర సిబ్బంది ఆ మొత్తాన్ని నాగరాజు కుటుంబానికి అందజేశారు.

సెల్‌ఫోన్లు అప్పగింత



హనుమాన్‌జంక్షన్‌రూరల్ : వీరవల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో చోరీకి గురైన సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చోరీకి గురైన నాలుగు సెల్ ఫోన్లను దొంగల దగ్గర నుంచి రికవరీ చేసిన ఎస్సై చిరంజీవి శనివారం వాటిని పోగొట్టుకున్న బాధితులకు అప్పగించారు.

కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి

ఎమ్మెల్యే బోడె ప్రసాద్



యనమలకుదురులో బోరును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, జూలై 27 : టీడీపీ కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర అభివృద్ధి పరుగులు పెట్టనుందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ వ్యాఖ్యానించారు. శనివారం తాడిగడప మునిసిపాలిటీలోని యనమలకుదురు క్లస్టరులో ఆయన వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వంలో సైకో జగన్‌రెడ్డి ఉత్తుత్తి బటన్ నొక్కి సంక్షేమం పేరుతో ప్రజలను దగా చేశాడని, కనీస మౌలిక సౌకర్యాలైన మంచినీరు, రోడ్లు, డ్రెయిన్ల అభివృద్ధిని నిర్లక్ష్యం చేసి ప్రజలను మోసం చేశాడని దుయ్యబట్టారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానికి సంక్షేమంతో పాటు అభివృద్ధి రెండు కళ్లలాంటివన్నారు. యనమలకుదురులో మూడవ సచివాలయాన్ని, శానిటరీ ఇన్‌స్పెక్షన్ భవనాన్ని, కొత్తగా నిర్మించిన రెండు నూతన బోర్‌వెల్స్‌ను ఆయన స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో తాడిగడప కమిషనర్ వెంకటేశ్వరరావు, జనసేన సమన్వయకర్త ముప్పా రాజా, టీడీపీ నాయకులు వెలగపూడి శంకరబాబు, వెలగపూడి బాబూరావు, ఆజాద్, నారాయణ, మొక్కపాటి శ్రీనివాస్, అంగిరేకుల మురళి, మాచిన శివ, పాదాల ప్రభాకర్, సంగెపు రంగారావు, శొంఠి శివరాంప్రసాద్, పీతా గోపీచంద్, తాతపూడి గణేష్, ఇబ్రహీం, వీరంకి కుటుంబరావు, బలగం నాగరాజు, రఫీ, పండుల రజిని, మల్లంపాటి విజయలక్ష్మి, బూక్యా బిచాలి, ధనేకుల భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

తాడిగడప మునిసిపాలిటీ కానూరులో పారిశుధ్యం మెరుగుపరిచి దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ వెల్లడించారు. శనివారం కానూరులో దోమల ఫాగింగ్‌కు ఏర్పాటు చేసిన ప్రత్యేక యంత్రాలను ఆయన పరిశీలించి మునిసిపల్ సిబ్బంది చేపట్టిన ఫాగింగ్‌ను పరిశీలించారు. దోమల నివారణకు డ్రైనేజీల్లో పూడిక తీతల ప్రత్యేక డ్రైవ్‌తో పాటు ఫాగింగ్ చర్యలు చేపట్టామని తెలిపారు. ఆయన వెంట మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు ఉన్నారు.

ఘరానా మోసంపై కేసు

పెనమలూరు, జూలై 27 : షేర్‌మార్కెట్‌లో పెట్టుబడి పెడితే అధిక లాభాలొస్తాయంటూ ఆన్‌లైన్‌లో చూసి పెట్టుబడి పెట్టిన ఒక వ్యక్తి ఇరవై రెండు లక్షలకు పైగా మోసపోయిన విషయంపై పెనమలూరు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. పోరంకి గ్రీన్ ఫీల్డ్ అపార్టుమెంట్‌లో నివాసముంటున్న సోమేపల్లి బ్రహ్మేశ్వరరావు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. ఈ ఏడాది మే నెలలో ఇతనికి ఒక ఫోన్ నెంబరు నుంచి మెసేజ్ వచ్చింది. మెసేజ్‌లో షేర్ మార్కెట్‌లో ప్రావీణ్యం ఉన్న వారు తమ వద్ద ఉన్నారని, ఆసక్తి ఉంటే తమ గ్రూపులో జాయిన్ అవ్వమని ఉంది. దీంతో బ్రహ్మేశ్వరరావు రెండు వందల మంది సభ్యులుగా ఉన్న ఆ గ్రూపులో చేరుతూ పదివేలు పెట్టుబడిగా పెట్టాడు. తెల్లవారే తన పెట్టుబడి వెయ్యి రూపాయలు పెరిగినట్లు చూపించారు. దీంతో నమ్మిన ఇతను విడతల వారీగా రూ. 22,34,000లను పెట్టుబడిగా చెల్లించాడు. ఈ నెల మూడున తన పేరుతో పెరిగిన సొమ్మును విత్‌డ్రా చేద్దామని విత్‌డ్రావల్ పెట్టగా విత్‌డ్రా అవ్వలేదు. దీంతో మోసపోయానని గ్రహించిన బ్రహ్మేశ్వరరావు పెనమలూరు పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

బహిరంగ ప్రకటన

యావన్మందికి తెలియచేయునది ఏమనగా నా క్లయింట్ అయిన వీరవల్లి గ్రామ కాపురస్థురాలు ప్రస్తుతం బూదివాళ్ క్యాంపు సింధనూరు తాలూకా రాయచూరు జిల్లా కర్ణాటక రాష్ట్రము లో నివాసం ఉంటున్న చిట్టినేని రత్నాకరరావు గారి భార్య చిట్టినేని ఇందిరా కుమారి, బాపులపాడు మండలంలోని, **వీరవల్లి గ్రామం** నందు RS No 352 నందు గల Ac 0-20 cents నివాస స్థలమునకు హక్కు దారులై ఉన్నారు. సదరు స్థలము నా క్లయింటు స్వాధీన హక్కు భుక్తములలో ఉన్నది. నా క్లయింట్ కు OS No 312/2000 నూజివీడు జూనియర్ సివిల్ జడ్జ్ కోర్ట్ వారు permanent injunction డిక్రీ ని ఇచ్చి ఉన్నారు. సదరు దావా లో ప్రతివాది అయిన బసంపూడి చంద్రమౌళి నూజివీడు జిల్లా కోర్ట్ నందు AS No 2/2011 అప్పీల్ దాఖలు చేయగా సదరు అప్పీలు డిస్మిస్ అయినది. తదుపరి చంద్రమౌళి ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ నందు SA No 511/2013 దాఖలు చేసి ఉన్నారు సదరు **హైకోర్ట్ నందు అప్పీల్ పెండింగ్ లో ఉన్నది.** ఇట్లుండగా సదరు బసంపూడి చంద్రమౌళి మరియు అతని సహచరులు సదరు హైకోర్టు నందు ఉన్న అప్పీల్ లో తనకు అనుకూలముగా తీర్పు వచ్చినది అని తప్పుడు ఆరోపణలు చేయుచు సదరు పై తెలిపిన భూమిని ఇతరులకు అమ్మజూపుతున్నాడని నా క్లయింట్ కు తెలిసినది. ఇందుమూలముగా ప్రజానీకానికి తెలియచేయునది ఏమనగా సదరు చంద్రమౌళి గారి తో పై భూమికి సంబంధించి ఎటువంటి లావాదేవీలు జరపవలదని సదరు భూమిని వారి వద్ద కొనుగోలు చేసినచో సదరు కొనుగోలు వ్యవహారములు చెల్లుబాటు కావని మరియు నా క్లయింట్ కి ఎటువంటి బాధ్యత లేదని తెలియచేయడమైనది.

K. JHANSI LAKSHMI, Advocate, High Court of AP
Plot No 28, II Lane, City Central Colony,
Near Prasanth Hospital, Labbipet, Vijayawada-520010.
Vijayawada. 27-07-2024

ఆగని ఇసుక దందా

మరో ట్రాక్టరును స్వాధీనం చేసుకొన్న పోలీసులు

పెనమలూరు, జూలై 27 : అర్ధరాత్రి.. ఇసుక తోడేళ్ల పేరిట ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు పెనమలూరు పోలీసులు స్పందించారు. శుక్రవారం అర్ధరాత్రి అనుమతుల్లేని యనమలకుదురు ఇసుక రీచ్‌లో ఇసుక అక్రమంగా తోలుకుపోతున్న ఇసుక ట్రాక్టరును పెనమలూరు సీఐ రామారావు ఆధ్వర్యంలోని పోలీసులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. రీచ్‌లలో అక్రమ తవ్వకందారుల కోసం జల్లెడపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, ప్రభుత్వ ఉచిత ఇసుక పాలసీకి తూట్లు పొడిచే అక్రమ ఇసుక తవ్వకందారులపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. అక్రమ ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని క్రిమినల్ చర్యలు తీసుకోవడంతో పాటు భారీగా జరిమానాలు విధించి ట్రాక్టర్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలపై సమీక్ష

హనుమాన్‌జంక్షన్, జూలై 27: గన్నవరంలో ఇటీవల ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కలెక్టర్‌తో కలిసి నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు అందించిన అర్జీలపై అధికారులు సమీక్షిస్తున్నారు. బాపులపాడు ఎస్సీ కాలనీలో సుదీర్ఘకాలంగా అరకొరగా తాగునీటిని అందిస్తున్న బోరు బావిని అభివృద్ధి చేసి ప్రజలకు ఉపయోగపడే విధంగా ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించాలని టీడీపీ బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు ఎమ్మెల్యే సమక్షంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ స్పందించి స్థల పరిశీలన చేసి గ్రామ పంచాయతీ తీర్మానం చేసి ఇచ్చినట్లైతే బోరు అభివృద్ధితో పాటు వాటర్ ట్యాంక్ కూడా నిర్మించడానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు దయాల రాజేశ్వరరావు తెలిపారు.

డ్రెయినేజీ ప్రక్షాళనకు గ్రామస్థులు సహకరించాలి



హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 27 : వీరవల్లి పంచాయతీ పరిధిలోని ప్రధాన డ్రెయినేజీ వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు పంచాయతీ సిబ్బందికి గ్రామసులు సహకరించాలని కార్యదర్శి శ్యామలరావు కోరారు. శనివారం వీరవల్లిలోని ప్రధాన డ్రెయినేజీ చెత్తతో పూడిపోవడాన్ని టీడీపీ నాయకులు పంచాయతీ పాలకవర్గ సభ్యులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. త్వరలోనే పూడికతీత పనులు మొదలు పెడతామని ఉప సర్పంచ్ లంక అజయ్, పాలకవర్గ సభ్యులు పిల్లా రామారావులకు ఈఓ శ్యామలరావు హామీ ఇచ్చారు. గుండపనేని ఉమావరప్రసాద్, మండాది రవీంద్ర పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడండి





ఈడుపుగల్లు జెడ్పీ పాఠశాలలో మొక్కలు నాటుతున్న డిప్యూటీ కలెక్టర్.. ఉయ్యూరులో ఎంకె ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థుల ర్యాలీ

ఈడుపుగల్లు (కంకిపాడు), జూలై 27 : పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు పాటుపడాలని డిప్యూటీ కలెక్టర్, సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్టు కో- ఆర్డినేటర్ రాములు నాయక్ అన్నారు. మండలంలోని ఈడుపుగల్లు జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం ఈడుపుగల్లు సర్పంచ్ పందిపాటి ఇందిరతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే పర్యవరణ పరిరక్షణపై దృష్టి సారించాల్సిన అవసరముందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ప్రసాద్, లలిత మోహన్, రాంబాబు, నగేష్, తదితరులు పాల్గొన్నారు.

చినఓగిరాల(ఉయ్యూరు) : ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం పురస్కరించుకుని చిన ఓగిరాల ప్రాథమిక పాఠశాలలో శనివారం అక్షయ హారతి జీవనం కో-ఆర్డినేటర్ యార్లగడ్డ పావని ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో ఔషధ మొక్కలు నాటి, కొన్ని విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యెనిగళ్ల శిరీష, టీడీపీ నాయకులు వై.కుటుంబరావు, యార్లగడ్డ సాయి పాల్గొని మొక్కలు నాటి, విద్యార్థులకు పంపిణీ చేశారు. పాఠశాల ఉపాధ్యాయుడు పీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

● ఉయ్యూరులో శ్రీ ఎంకె బాబు ఇంగ్లీషు మీడియం స్కూల్ డైరెక్టర్ ఎంకె బాబు ఆధ్వర్యంలో వనమహోత్సవం నిర్వహించారు. ఉయ్యూరు చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై ప్రదర్శనలో పాల్గొని విద్యార్థులకు వనమహోత్సవ విశిష్టతను తెలియజేశారు.

హనుమాన్‌జంక్షన్ : ప్రకృతిని మనం కాపాడినపుడే మనల్ని ప్రకృతి కాపాడుతుందని పర్యావరణాన్ని కాపాడడానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని బాపులపాడు ఎంఈవో-2 బట్టు సురేష్‌కుమార్ తెలిపారు. బాపులపాడు జడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న శిక్ష సప్తాహం కార్యక్రమంలో భాగంగా శనివారం విద్యార్థులు తమ తల్లుల పేరిట మొక్కలు నాటారు. పాఠశాలలో కొత్తగా చేరిన 75 మంది విద్యార్థుల చేత హెచ్ఎం నాగేశ్వరరావు మొక్కలు నాటించారు. కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ సుంకర సుభాష్ చంద్రబోస్, రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయుడు అక్కినేని రాఘవేంద్రరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు పి.వెంకటేశ్వరరావు, పీఆర్ ఏఈ జయరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్స్ 31న

గన్నవరం, జూలై 27: స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 31న ఉదయం స్పాట్ అడ్మిషన్ జరుగుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎ.పద్మావతి శనివారం ఒక ప్రకటలో పేర్కొన్నారు. 10వ తరగతిలో ఉత్తీర్ణులైన వారు, పాలిసెట్ పరీక్షలో ఉత్తీర్ణత పొంది సీటు రాని వారు, ఉత్తీర్ణత పొందని వారు అర్హులని తెలిపారు. కళాశాలలో 4 విభాగాల్లో కంప్యూటర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్, మెకానికల్ విభాగాల్లో ఖాళీలు ఉన్నాయని తెలిపారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



కంకిపాడు, జూలై 27 : కమ్మ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కంకిపాడులోని బుడ్డి యువసేన అధ్యక్షులు కొప్పరాజు సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో స్థానిక టీడీపీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బండి నాంచారయ్య, నెరుసు సతీష్, గోగినేని వెంకటరమణ, కొండా నాగేశ్వరరావు, చలవాది రాజా, వణుకూరు విక్రమ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తిచేయాలి



ఆర్ అండ్ బీ ఎస్ఈ వీకే విజయశ్రీకి సమస్యను వివరిస్తున్న కొయ్యూరు సర్పంచ్

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 27 : జాతీయ రహదారి నుంచి బొమ్ములూరు, కొయ్యూరు మీదుగా ఎంఎన్‌కే రహదారిని కలిపే లింకు రహదారి అభివృద్ధి పనులు ఆగిపోవడంతో రైతులు, గ్రామస్థులు ఇబ్బందులెదుర్కొంటున్నారని పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతూ ఆర్ అండ్ బీ సూపరింటెండెంట్ ఇంజనీర్ వీకే విజయశ్రీకి శనివారం వినతిపత్రం అందజేశారు. కొయ్యూరు సర్పంచ్ కొల్లి వీర వెంకట సత్యనారాయణ విజయవాడ లోని ఆర్ అండ్ బీ కార్యాలయంలో అధికారిని కలిసి సమస్యను వివరించారు. ఈ కార్యక్రమంలో గోగినేని బ్రహ్మజీ, తూమాటి సాంబశివరావు, కాండ్రు అజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	104, 113, 124
చికెన్ విత్ స్కిన్	196
చికెన్ స్కిన్‌లెస్	206

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.4.80

యోగాతో శారీర, మానసిక ఆరోగ్యం



మచిలీపట్నం టౌన్ : శారీరక, మానసిక రుగ్మతలు తొలగిపోయేందుకు ప్రతి ఒక్కరికీ యోగా ఎంతో దోహదపడుతుందని కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. గత ఐదు రోజులుగా జడ్పీ కన్వెన్షన్ హాలులో జిల్లా అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులకు నిర్వహిస్తున్న ప్రత్యేక యోగా శిక్షణ తరగతుల్లో శనివారం ఆయన పాల్గొన్నారు. యోగా సాధనలో జిల్లా రెవెన్యూ అధికారి కె. చంద్రశేఖరరావు, ఎలక్ట్రికల్ ఈఈ భాస్కరరావు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బాబు నాయక్

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

అవనిగడ్డ, జూలై 27 : యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని అవనిగడ్డ సీనియర్ సివిల్ జడ్జి బాబు నాయక్ సూచించారు. అవనిగడ్డ డిగ్రీ కళాశాలలో మండల న్యాయసేవాధికార కమిటీ నేతృత్వంలో కళాశాల విద్యార్థులకు మాదక ద్రవ్యాల దుష్పరిమాణాలు, ర్యాగింగ్ వల్ల జరిగే నష్టాలు, హెల్మెట్ వినియోగవం వల్ల ప్రయోజనాలపై శనివారం అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి ఎల్.గోపీనాథ్ హెల్మెట్ వినియోగం ఆవశ్యకతను వివరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సనకా రఘురామ్ అధ్యక్షత వహించగా, కొండవీటి ఈశ్వరరావు, అందె శివరామకృష్ణ, ఏపీపీ ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ ఉమారాణి, కళాశాల అధ్యాపకులు, ఎస్సై ఎల్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగల నుంచి నిప్పు రవ్వలు రాలి
గుర్రాలలంకలో రెండు పూరిళ్లు దగ్ధం



పమిడిముక్కల, జూలై 27 : గుర్రాలలంకలో శనివారం అగ్నిప్రమాదం సంభవించి రెండు పూరిళ్లు కాలి బూడిదయ్యాయి. అన్నపురెడ్డి అప్పన్న, పోతన రాజ్యలక్ష్మికి చెందిన పూరిళ్లపైన ఉన్న విద్యుత్ వైర్లు గాలికి ఒక దానితో ఒకటి తగిలి నిప్పు రవ్వలు రాలి పూర్తిగా కాలిపోగా రెండు కుటుంబాల వారు కట్టుబట్టలతో మిగిలారు. ఉయ్యూరు అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపుచేశారు. అప్పన్న తన కుమార్తె డెలివరీ కోసం తీసుకువచ్చి ఇంటిలో ఉంచిన లక్ష రూపాయల నగదుతో పాటు బంగారు ఆభరణాలు, సామాన్లు కాలిపోయాయి. రాజ్యలక్ష్మి ఇల్లు, ఇంటిలో వస్తువులు కాలిపోగా ప్రమాదంలో రూ. 7 లక్షల మేర ఆస్తి నష్టం జరిగిందని అంచనా వేశారు.

విద్యుదాఘాతంతో రాడ్ బెండింగ్ కార్మికుడు మృతి

● రూ.4.50 లక్షల నష్టపరిహారం

గుడివాడ : వలివర్తిపాడుకు చెందిన రాడ్ బెండింగ్ కార్మికు డి.శరత్‌కుమార్ గౌరీశంకరపురంలో నూతన భవనానికి పని చేస్తుండగా ప్రమాదవశాత్తు శుక్రవారం విద్యుదాఘాతానికి గుర య్యాడు. తీవ్ర గాయాలపాలైన శరత్‌కుమార్‌ను ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఒక పాప, బాబు ఉన్నారు. సీఐటీయూ, భవన నిర్మాణ కార్మికులు డిమాండ్ మేరకు మృతుడి కుటుంబానికి ఇంటి యజమాని రూ.4.50 లక్షల నష్టపరిహారాన్ని అందజేశారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు చల్లపల్లి విద్యార్థులు



చల్లపల్లి : రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ జూనియర్, సీనియర్ విభాగాలకు విజయ జూనియర్ కళాశాల, వివేకానంద డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఘంటసాల మండలం గోగినేని పాలెం జడ్పీ హైస్కూల్‌లో జరిగిన సాఫ్ట్ బాల్ జూనియర్, సీనియర్ జట్ల ఎంపికలో విజయ జూనియర్ కాలేజీ నుంచి జూనియర్ విభాగంలో వేమూరి గాయత్రి, కట్టా శాంతి, గరికిపూడి హాసిని, పడమట దుర్గా తేజస్విని, పడమట ధనుష్, గురువిందపల్లి రవితేజ ఎంపికయ్యారు. వివేకానంద డిగ్రీ కళాశాల నుంచి సీనియర్ విభాగంలో కొడాలి రేణుశ్రీ, బుర్రె సాయి, దివి లక్ష్మీ ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ యార్లగడ్డ శివప్రసాద్, డైరెక్టర్ యార్లగడ్డ చక్రధర్, వివేకానంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పెమ్మసాని రమేష్‌బాబు, విజయ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ షేక్ అబ్దుల్ రహీం, ఫిజికల్ డైరెక్టర్ కొడాలి చందు అభినందించారు.

అగ్నిబాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



మచిలీపట్నం టౌన్ : తాళ్లపాలెం శివారు జొన్నలవారిమోడి గ్రామంలో శనివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో అడ్డాల అంజమ్మ పూరిపాక దగ్ధమైంది. సర్వం కోల్పోయిన బాధితురాలు అంజమ్మకు మచిలీపట్నం నియోజక వర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ రూ.15 వేలు ఆర్థిక సాయం అందించారు. బండి రామకృష్ణ మాట్లాడుతూ, ప్రభుత్వ పరంగా అందాల్సిన సాయం కోసం మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి దృష్టికి తీసుకుని వెళ్తానన్నారు. గడ్డం రాజు, కూనపరెడ్డి ప్రసాద్, రమేష్, జోజిబాబు, చాముండేశ్వరరావు, రాజు, నాగేశ్వరరావు, నాగబాబు, సతీష్, వాకలయ్య, దాసు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి వాటర్ ట్యాంక్ వితరణ

మోపిదేవి : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన భీమిరెడ్డి సుధీర్ రెడ్డి - రజిత దంపతులు స్టీలు వాటర్ ట్యాంక్‌ను అందజేశారు. శనివారంకుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. నిత్యాన్నదాన పథకానికివాటర్ ట్యాంక్‌ను ఆలయ ఈవో ఎస్.ఎస్.చక్రధరరావుకు అందజేశారు. ఆలయ పర్యవేక్షకులు బొప్పన సత్యనారాయణ, సహాయక ఉద్యోగులు ఉన్నారు.



లేడీయాంప్తిల్ ప్రభుత్వ మహిళా కళాశాల ఫ్రెషర్స్ డేలో మాట్లాడతున్న మంత్రి రవీంద్ర



గుండేరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మండలి



కౌలు కార్డులిస్తున్న ఎమ్మెల్యే కాగిత

రెండేళ్లలో పుష్కలంగా ఉద్యోగావకాశాలు

● లేడియాంప్తిల్ బాలికల జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డేలో మంత్రి రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జూలై 27 : రాష్ట్రంలో విద్యా రంగానికి తగిన ప్రాముఖ్యత కల్పిస్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. స్థానిక లేడీయాంప్తిల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డేలో రవీంద్ర ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, రెండేళ్లలో బందరు రూపురేఖలు పూర్తిగా మారిపోతాయన్నారు. పోర్టు నిర్మాణం త్వరలో పూర్తవుతుందని, పోర్టుతో పాటు అనుబంధ సంస్థలు రావడంతో యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. మహిళా జూనియర్ కళాశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని చేపడతామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఐనంపూడి ఆనందకుమార్ అధ్యక్షతన జరిగిన సాల్మన్‌రాజు, బాబాప్రసాద్, భగత్, లంకిశెట్టి బాలాజీ, లంకే నారాయణ ప్రసాద్, గోవాడ శాంతి, హరనాథబాబు, మున్వర్, రాంబాబు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ గుండేరు డ్రెయిన్ పరిశీలన

చల్లపల్లి : డ్రైనేజీ పనులు సమర్థవంతంగా నిర్వహించాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అధికారులకు సూచించారు. లక్ష్మీపురం వద్ద గుండేరు మేజర్ డ్రెయిన్ ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ శనివారం పరిశీలించారు. గుండేరు మేజర్ డ్రెయిన్‌లో గుర్రపుడెక్క, తూటుకాడ తొలగింపు పనులు చల్లపల్లి డ్రైనేజీ సబ్ డివిజన్ ఆధ్వర్యంలో చేపట్టగా, పూర్తిచేసిన పనులను ఆయన పరిశీలించారు. మోపిదేవి జడ్పీటీసీ మెడబలిమి మల్లిఖార్జునరావు, టీడీపీ నేత పరిశె చలపతిరావు, డీఈఈ పులిగడ్డ వెంకటేశ్వరరావు, ఏఈఈ కె.హరీష్ పాల్గొన్నారు.

కౌలు కార్డుల పంపిణీ

పెడన : ప్రజలకిచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం విజయవంతంగా నెరవేరుస్తోందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. తరకటూరు గ్రామంలో శనివారం ఆయన రైతులకు కౌలు కార్డులను పంపిణీ చేశారు. పోతన స్వామి, గోపీ నాగబాబు, ఎస్‌ఏ బేగ్, శాయన సోమయ్య, కట్టా మునీశ్వరరావు, కోలపల్లి రజని తదితర నాయకులు పాల్గొన్నారు.

వెంకటాద్రి చౌదరి సేవలు చిరస్మరణీయం : ఎమ్మెల్యే వెనిగండ్ల



గుడ్లవల్లేరు : మండల పార్టీ అధ్యక్షుడిగా కొసరాజు వెంకటాద్రి చౌదరి (డాక్టర్ బాబు) పార్టీకి ఎనలేని సేవలందించారని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. వెంకటాద్రి చౌదరి 72వ జయంతిని కొసరాజు సేవా సమితి ఆధ్వర్యంలో గుడ్లవల్లేరులో ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బాబు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. మన గుడివాడ మన రాము కార్యక్రమాల కోసం కొసరాజు సేవా సమితి అధ్యక్షుడు, నిర్వాహకులు కొడాలి రామరాజు సొంత నిధులతో తాగునీటి ట్యాంకర్, ట్రాక్టర్‌ను ఏర్పాటు చేసి ఎమ్మెల్యే రాముకు అందజేశారు. వల్లభనేని వెంకటరావు, తులసి, జంగం మోహనరావు, అడుసు మిల్లి రామ్మోహనరావు, ముళ్లపూడి రమేష్ చౌదరి, గోకవరపు సునీల్, నరేంద్ర, రాంబాబు, వీరమాచనేని శివ ప్రసాద్, బొప్పన శివప్రసాద్,మరీదు నాగలక్ష్మి, కానూరి సత్తిబాబు, ఈడ్పుగంటి పిచ్చేశ్వరరావు, రమేష్, మాదాసు శ్రీను, తోట చిన్నారి, లక్ష్మీనరసింహరాజు పాల్గొన్నారు.



గ్రామదేవతలకు ఆషాఢ సారె

మోపిదేవి : మోపిదేవి గ్రామ దేవతగా పూజలందుకుంటున్న మన శ్రీయలమ్మ, వల్లీదేవసేన అమ్మవార్లకు ఆర్యవైశ్య మహిళలు ఆషాఢ సారె సమర్పించారు. ఆర్యవైశ్య కల్యాణ మండపంలో వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారికి సారె సమర్పించి విశేష పూజలు జరిపారు. కల్యాణ మండపం నుంచి మహిళలు ర్యాలీగా గ్రామ దేవత మనశ్రీయలమ్మకు, ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజల్లుతున్న శ్రీవల్లీ, దేవసేన అమ్మవార్లకు ఆషాఢ సారె సమర్పించారు.

శాకంబరీగా వీర్లంకమ్మ



బంటుమిల్లి : చోరంపూడిలో వీర్లంకమ్మ అమ్మవారు శనివారం శాకంబరీగా దర్శనమిచ్చారు. కుంకుమ పూజలు చేసి, భారీ స్థాయిలో అన్నసమరాధన నిర్వహించారు. గ్రామ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.



చలమలశెట్టిని సత్కరిస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

జ్యూయలరీ పార్క్‌లో రక్తదాన శిబిరం

మచిలీపట్నం టౌన్ : అన్ని దానాల్లో కెల్లా రక్తదానం గొప్పదని జ్యూయలరీ పార్కు అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, గోల్డ్ ప్రిన్స్ అధినేత చలమలశెట్టి నరసింహారావు అన్నారు. జ్యూయలరీ పార్కులో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ టి.ఎస్.ఎస్.బాలాజీ, కార్యదర్శి భవిరిశంకరనాథ్, డాక్టర్ హనుమంతయ్య, సంఘ కార్యదర్శి జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్లోకి నానో యూరియా

గుడివాడ : మార్కెట్లోకి నానో శక్తి యూరియా, డీఏపీలను ప్రవేశపెడుతున్నట్లు వీపీఎల్ చీఫ్ మేనేజర్ ఎండీ రఫీ అన్నారు. గుడివాడలోని ఒక హోటల్‌లో జిల్లా వ్యవసాయ ఉత్పత్తుల డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవలం ఎకరాకు అర లీటరు నానో యూరియాను పిచికారీ చేస్తే సరిపోతుందన్నారు. డీజీఎం డాక్టర్ సుదానంద్, మేనేజర్ నటరాజ్, అసిస్టెంట్ మేనేజర్ కె.రవీంద్రనాథ్, జె.కె.ఎస్ వి.మోజెస్, హోల్‌సేల్, డీలర్లు పాల్గొన్నారు.

బాలలతో పనులు చేయిస్తే జరిమానా, జైలు

పెదపారుపూడి : దుకాణాలలో బాలలు, మైనర్లతో పని చేయిస్తే జరిమానాతోపాటు జైలు శిక్ష పడుతుందని గుడివాడ కార్మిక అధికారి వి.ఎస్. బిందు హెచ్చరించారు. వెంట్రప్రగడ గ్రామంలో దుకాణాలను శనివారం ఆమె తనిఖీ చేశారు. చట్టం ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ, డ్వాక్రా మహిళలు ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేయించుకోవాలన్నారు.

సేంద్రియ సాగుపై రైతులకు శిక్షణ

గుడివాడ రూరల్ : రైతులు సేంద్రియ వ్యవసాయం చేయడం ద్వారా ఖర్చు తగ్గడంతో పాటు ప్రజారోగ్యాన్ని కాపాడిన వారవుతారని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ శ్రీనివాసరావు అన్నారు. ఆత్మ సమన్వయంతో జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి మాట్లాడుతూ వాతావరణానికి అనుకూలమైన వరి వంగడాలను రైతులు సాగు చేయాలని కోరారు. ఏవో బోలెం అనంతలక్ష్మి, ఏఈవో అనిత, రైతులు పాల్గొన్నారు.

క్యాన్సర్ నిర్ధారణ శిబిరం రేపు

నాగాయలంక : ఈనెల 30వ తేదీన నాగాయలంక కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో ఉదయం 9 గంటల నుంచి మహిళలకు క్యాన్సర్‌పై అవగాహనశిబిరం నిర్వహిస్తున్నట్లు సుదర్శి మానవతా సేవా సంస్థ ప్రతినిధి రఘుశేఖర్ తెలిపారు.

రామకృష్ణకు జెమ్ ఆఫ్ ఇండియా అవార్డు



చల్లపల్లి, జూలై 27 : చల్లపల్లికి చెందిన కె.రామకృష్ణ ఆల్ ఇండియా అచీవర్స్ కాన్ఫరెన్స్ ఆర్గనైజేషన్ జెమ్ ఆఫ్ ఇండియా అవార్డు అందుకున్నారు. న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఆర్గనైజేషన్ డైరెక్టర్ అభిషేక్ బచ్చన్ ఆధ్వర్యంలో రామకృష్ణకు అవార్డును ప్రదానం చేసి సత్కరించారు. రామకృష్ణ చల్లపల్లి శ్రావ్య ఫ్యాన్సీలో గత 20 సంవత్సరాలుగా పని చేస్తూ కరోనా సమయంలో పేదలు, ప్రైవేటు ఉపాధ్యాయులకు విస్తృత సేవలందించి సమాజంలో తన వంతు బాధ్యతను నిర్వర్తించారు. గతంలోనూ హైదరాబాద్‌లో ఆల్ ది బెస్ట్ ఆర్ట్ అకాడమీ సేవా పురస్కారాన్ని సైతం రామకృష్ణ అందుకున్నారు.

పిచ్చుక ఫణికుమార్‌కు స్వర్ణ నంది సేవారత్న అవార్డు



పెడన : పెడనకు చెందిన సామాజిక కార్యకర్త పిచ్చుక ఫణికుమార్ స్వర్ణ నంది కళాకార్ సేవా రత్న అవార్డుకు ఎంపికయ్యారు. కరోనా కష్టకాలంలో పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేసి ఎంతగానో ఆదుకున్నారు. ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడుగా వ్యవహరిస్తున్న ఫణికుమార్ చేనేత కార్మికుల సంక్షేమానికి విశేష కృషి జరిపారు. ఆయన సేవలను గుర్తించిన హైదరాబాద్‌కు చెందిన మెగా ఎంటర్ ప్రైజెస్ సంస్థ ఆయనను స్వర్ణనంది కళాకార్ సేవారత్న అవార్డుకు ఎంపిక చేసింది. హైదరాబాద్ చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలో అవార్డు అందుకుంటారు.

పూడికతీత పనుల పరిశీలన

కోడూరు : కోడూరు 14వ నెంబర్ కాల్వ పూడికతీత పనులను మాజీ జడ్పీటీసీ సభ్యుడు బండే శ్రీనివాసరావు, కూటమి నేతలు పరిశీలించారు. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ చొరవతో పంట కాల్వల పూడికతీత పనులు జరుగుతున్నాయని శ్రీనివాసరావు తెలిపారు. ఉల్లి శేషగిరిరావు, ముద్దినేని చంద్రరావు, అద్దంకి పాండురంగారావు, గోగినేని సోమశేఖరరావు, కడవకొల్లు శ్రీనివాసరావు, పూతబోయిన శ్రీనివాసరావు, దావు మల్లి, వేములపల్లి శ్రీకృష్ణ, బొడ్డు వెంకన్న, జాన్ విల్సన్ పాల్గొన్నారు.

గురుకుల భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి

అవనిగడ్డ రూరల్ : పులిగడ్డ బాలుర గురుకుల విద్యాలయంలో అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణానికి త్వరితగతిన పూర్తి చేయటానికి చర్యలు తీసుకోవాలని జనసేన జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్ కోరారు. గురుకుల విద్యాలయాన్ని ఆయన గురువారం ఆయన సందర్శించారు. పాఠశాలలోని విద్యార్థులకు సరిపడా గదులు లేకపోవటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మరుగుదొడ్లు సైతం అధ్వాన్నస్థితిలో ఉన్నాయని తెలిపారు. పాఠశాలలో ఖాళీగా ఉన్న సైన్స్ ఉపాధ్యాయురాలి పోస్టు భర్తీ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పాఠశాల విద్యార్థులతో కలసి రాయపూడి సహపంక్తి భోజనం చేశారు.

వృద్ధాశ్రమాల్లో అన్నదానం

చల్లపల్లి : లయన్స్ క్లబ్ సభ్యులు ఎం.వి.కృష్ణారావు సతీమణి లలితాదేవి జయంతి సందర్భంగా శనివారం చల్లపల్లిలోని సీయోను, ఆదరణ వృద్ధాశ్రమాల్లో అన్నదానం నిర్వహించారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రాయపాటి రాధాకృష్ణ, కస్తూరి వెంకట ప్రసాద్, క్లబ్ పెద్దలు టి.సాంబశివరావు, కొల్లిపర మధు, ఉప్పల సాంబశివరావు, వరదా హరిగోపాల్, ఏపీ చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

మోపర్రులో ఉచిత పశు వైద్యశిబిరం

పెదపారుపూడి : మోపర్రులో శనివారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. యలమర్రు సహాయ సంచాలకులు డాక్టర్ జి.వి.నరసింహారావు 45 గేదెలకు, 70 గొర్రెలకు గర్భ సంచి పరీక్షలు చేసి వైద్యం అందించారు. గుడ్లవల్లేరు ఉప సంచాలకులు డాక్టర్ సి.శ్రీనివాసరావు, వెంట్రప్రగడ పశువైద్యులు డాక్టర్ ఎన్.వనిత, మండల పశువైద్యులు డాక్టర్ హెచ్.జయంత్, పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సీడబ్ల్యూప మచిలీపట్నం డివిజన్ కోశాధికారిగా యూపీఆర్ విఠల్



బంటుమిల్లి : చీఫ్ ఆఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఎడ్వైజర్ వెల్ఫేర్ అసోసియేషన్ (సీడబ్ల్యూప) మచిలీపట్నం డివిజన్ కోశాధికారిగా బంటుమిల్లికి చెందిన యూపీఆర్ విఠల్ ఎన్నికయ్యారు. మచిలీపట్నం బ్రాంచ్ మేనేజర్ కృష్ణకుమారి, ఏబీఎం సాయిరామ్ కిరణ్, ఏజెంట్స్ అసోసియేషన్ సభ్యులు, మచిలీపట్నం డివిజన్ స్టాడింగ్ కార్యదర్శి సన్యాల రఘు, ఏజెంట్స్ అసోసియేషన్ సభ్యులు విఠల్‌కు అభినందనలు తెలిపారు.



మాట్లాడుతున్న న్యాయాధికారి భాస్కరరావు

యువత ఉన్నత లక్ష్యాలను సాధించాలి

బంటుమిల్లి : యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని బంటుమిల్లి మండల న్యాయసేవా సాధికార కమిటీ చైర్మన్, సివిల్ కోర్టు న్యాయమూర్తి ఎం.భాస్కరరావు అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పలు సామాజిక అంశాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. భాస్కరరావు మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. ప్రతి విద్యార్థి సామాజిక బాధ్యత కలిగి ఉండాలన్నారు. న్యాయవాదులు యాళ్ల సోమశేఖర్, పళ్ళెం వీరవెంకటేశ్వరరావు, కూనపరెడ్డి రాంబాబు, రాయుడు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జగన్మోహనరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.



సుందర నగరంగా బందరు

మచిలీపట్నం టౌన్ : బందరును సుందర మచిలీపట్నంగా తీర్చిదిద్దుదామని మచిలీపట్నం నగర పాలక సంస్థ కమిషనర్ బాపిరాజు అన్నారు. శనివారం 25వ డివిజన్ వత్తుల్లాబాద్‌లో టీడీపీ కార్పొరేటర్ చిత్తజల్లు నాగరాము ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ బాపిరాజు, కార్పొరేటర్ చిత్తజల్లు నాగరాము స్వయంగా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. డ్రైనేజీలోని సిల్టు తీయించారు. పారిశుధ్య కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



అవనిగడ్డ రూరల్ : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మొక్కలు నాటాలని హెచ్‌ఎం రవికిరణ్ తెలిపారు. అశ్వారావుపాలెం ప్రాథమిక ఉన్నత పాఠశాలలో అమ్మ పేరుతో మొక్క నాటుదాం కార్యక్రమంలో భాగంగా శనివారం మొక్కలను విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు నాటారు. మండలంలోని పలు పాఠశాలల్లో మొక్కలు నాటారు.



విక్కుర్తికి రైతుల సత్కారం

నాగాయలంక : దాదాపు రూ.2 లక్షలకు పైగా వెచ్చించి ఎక్స్‌కవేటర్‌తో కాల్వ పూడికతీత పనులు పూర్తి చేసిన సందర్భంగా పారిశ్రామిక వేత్త విక్కుర్తి శ్రీనివాసరావును రైతులు ఘనంగా సత్కరించారు. జొన్నలగడ్డ వెంకట నారాయణ, లోయ రామారావు, కట్టా వెంకటేశ్వరరావు, నాయుడు రామయ్య, కొక్కిలిగడ్డ శ్రీనివాసరావు, నాయుడు నరసింహారావు, విశ్వనాథపల్లి దుర్గారావు, కొప్పనాతి వెంకటేశ్వరరావు, తమ్ము అర్జునరావు, వనమాల రామారావు, కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, కోలా భిక్షం, దావు వెంకటేశ్వరరావు, బెల్లంకొండ శ్రీను పాల్గొన్నారు.